ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో

మీకు నిజం రాసే ధైర్యం ఉందా?

అందుకు

వార్త సంధ్య మీ వేదిక!

రండి — ప్రజల గళంగా, నిజం కోసం మాతో కలవండి.

ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి

vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR

EDITOR & MD

VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 190 ఆదివారం 28 - 06 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజిలు : 08 వెల : 6/-


Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 190 Sunday 28 - 06 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-


## ముందుకు 3 అడుగులు

# చుట్టూ 1 అడుగే

- ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ సైజుపై పరిమితులు
- ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ సైజుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు
- నిర్మాణ వ్యయం పెరగకుండా అదుపు చేసేందుకే ఈ నిర్ణయం
- ఇళ్ల స్లాబు 500 నుంచి 750 చదరపు అడుగులు మాత్రమే ఉండాలని జీవో
- ముందువైపు మూడు అడుగులు, మిగతా వైపులా ఒక అడుగు
- లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నారని గుర్తించిన గృహ నిర్మాణ సంస్థ
- ఉత్తర్వులు జారీ చేసిన గృహనిర్మాణ శాఖ కార్యదర్శి



**వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 27 :** ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ విస్తీర్ణంపై ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇందిరమ్మ ఇళ్ల స్లాబు 750 చదరపు అడుగులకు మించరాదని గృహ నిర్మాణ శాఖ స్పష్టం చేసింది. ముందు వైపు 3 అడుగులు, మిగతా వైపు ఒక అడుగు మాత్రమే ముందుకు రావాలని తెలిపింది. ఇంట్లోకి ఎండ, వర్షం రాకుండా అవసరమైతే సజ్జలు నిర్మించుకోవాలని సూచించింది. స్లాబ్ ఎక్కువ వేసి ఖర్చు పెరగడంతో లబ్ధిదారులు అనవసర అప్పులు చేస్తున్నట్లు గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు గృహ నిర్మాణ శాఖ వెల్లడించింది. కొత్త వాటితో పాటు ప్రస్తుతం రూఫ్ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది.ఇందిరమ్మ ఇళ్ల స్లాబు ఇక నుంచి ఇష్టం వచ్చిన సైజులో - మిగతా 2 లో

## బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ

- రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు
- బీజేపీ విజయానికి హైదరాబాద్ నుంచే నాంది పలుకుతామన్న రాంచందర్ రావు
- బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి వచ్చినా బీజేపీని ఓడించలేవని ధీమా
- బీజేపీ జాతీయ నాయకత్వం తెలంగాణ వైపు చూస్తోందన్న లక్ష్మణ్



**వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 27 :** పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ కంచు కోటను బద్దలు కొట్టి అధికారంలోకి రావడంతో దేశ వ్యాప్తంగా బీజేపీ నేతలు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వెల్లివిరుస్తోంది. తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో సైతం ఫుల్ జోష్ నెలకొంది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ... తెలంగాణలో - మిగతా 2 లో

### ముగ్గురు సీఎంల రహస్య సమావేశంలో
## ఏ ఒప్పందాలు జరిగాయి

- మాజీ మంత్రి హరీష్ రావు
- చంద్రబాబు, రేవంత్, డీకే శివకుమార్ భేటీపై హరీష్ స్పందన
- తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే చారిత్రక ఒప్పందం అని రేవంత్ అంటున్నారని విమర్శ
- శిష్యుడు సీఎం అయ్యాడని చంద్రబాబు గుంద్రేవులను తీసుకొస్తున్నారని ఆరోపణ




## సౌదీ ప్రయాణికులకు బంగారంపై కొత్త నిబంధనలు

- సౌదీ అరేబియాకు వెళ్లే ప్రయాణికులకు బంగారంపై కొత్త నిబంధనలు
- విలువైన వస్తువుల డిక్లరేషన్ పరిమితి 60,000 నుంచి 40,000 రియాల్స్‌కు తగ్గింపు
- సుమారు రూ.10 లక్షల విలువైన బంగారం, నగలపై వివరాలు వెల్లడించాల్సిందే
- నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, వస్తువుల జప్తు
- మనీ లాండరింగ్ నిరోధానికి చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం







### రెండేళ్లలో 500 నగరాలకు
## భారత్ ట్యాక్సీ సేవలు

- కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా
- గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన కేంద్రమంత్రి
- రాబోయే రెండేళ్లలో దేశంలోని 500కు పైగా నగరాలకు సేవలు విస్తరించనున్నట్లు ప్రకటన
- ఈ జులై 31 లోపు ఏడు ప్రధాన నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు వెల్లడి

**వార్త సంధ్య,ఢిల్లీ, జూన్ 27 :** రవాణా రంగంలో సహకార స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో 'భారత్ ట్యాక్సీ' దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించబోతోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. రాబోయే రెండు సంవత్సరాల్లో దేశంలోని 500కు పైగా నగరాలు, పట్టణాల్లో ఈ సహకార మొబిలిటీ ప్లాట్‌ఫామ్ సేవలను అందు బాటులోకి తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నేడు గుజ రాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన సందర్భంగా అమిత్ షా ఈ కీలక ప్రకటన చేశారు.గుజరాత్‌లోని అన్ని ప్రధాన నగరాల్లో టూ-వీలర్లు,ఆటో-రిక్షాలు, - మిగతా 2 లో

### తెలంగాణకు చల్లని కబురు..
## వారం రోజుల పాటు విస్తారంగా వర్షాలు!

- రానున్న ఏడు రోజుల పాటు తెలంగాణలో భారీ వర్షాలు
- రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ
- ఉత్తర, తూర్పు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
- హైదరాబాద్‌లో రాత్రికి భారీ వర్షం పడే సూచనలు



**వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 27 :** నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి చాలా రోజులు గడుస్తున్నా వర్షాలు లేక తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని కబురు - మిగతా 2 లో

## 194 ఏళ్ల 'జోనాథన్' తాబేలును కలిసిన ప్రధాని మోదీ

- సెషెల్స్ పర్యటనలో ప్రపంచంలోనే అత్యంత వృద్ధ తాబేలుతో ప్రధాని మోదీ భేటీ
- 194 ఏళ్ల 'జొనాథన్' నివసిస్తున్న బొటానికల్ గార్డెన్స్‌కు సందర్శన
- పర్యావరణ పరిరక్షణకు గుర్తుగా మొక్కను నాటిన ప్రధాని
- భారత్–సెషెల్స్ దౌత్య సంబంధాలకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన

**వార్త సంధ్య,ఢిల్లీ, జూన్ 27 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సెషెల్స్ పర్యటనలో ఒక ప్రత్యేక అతిథిని కలిశారు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద వయసు భూచర జీవిగా గిన్నిస్ రికార్డుల్లోకెక్కిన 'జోనాథన్' అనే తాబేలుతో ఆయన - మిగతా 2 లో



## పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసే వారికే పదవులు




- ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశంలో పవన్ కల్యాణ్
- అన్ని కులాలను కలుపుకుని వెళ్తేనే మనుగడ సాధించగలమని కార్యకర్తలకు సూచన

**వార్త సంధ్య, అమరావతి, జూన్ 27 :** పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసే వారికి మరిన్ని పదవులు దక్కుతాయని పవన్ స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను గుర్తించి వారి ఎదుగుదలకు సహాయం చేస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలో నిర్వహించిన జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశానికి హాజరైన జనసేన అధినేత, ఉప - మిగతా 2 లో



## పరామర్శించేందుకు వెళ్లారా లేక రౌడీయిజం చేసేందుకు వెళ్లారా

- ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత
- వైసీపీ నేతలను అడ్డుకున్న అమరావతి రైతులు
- అమరావతిలో అడుగుపెట్టే అర్హత వైసీపీ నేతలకు లేదన్న అనిత
- వైసీపీ నేతలను అడ్డుకున్నది భూములిచ్చిన రైతులేనని వెల్లడి

**వార్త సంధ్య, అమరావతి, జూన్ 27 :** ఉండవల్లిలో వైసీపీ నేతల (పేర్ని నాని, అంబటి రాంబాబు, దేవినేని అవినాశ్) పర్యటన సందర్భంగా జరిగిన రాళ్లదాడిపై ఏపీ హోంమంత్రి వంగలపూడి - మిగతా 2 లో

## వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తనదే

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- వెలిగొండ రైతులు రాష్ట్రానికి ఆదర్శం
- వెలిగొండకు నేనే శంకుస్థాపన చేశా, పూర్తిచేసే బాధ్యత కూడా నాకే వచ్చింది
- మార్కాపురం జిల్లాలో చంద్రబాబు పర్యటన
- 'సంజీవని' ఆరోగ్య కార్యక్రమం ప్రారంభం
- వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులు, లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం



**వార్త సంధ్య, అమరావతి, జూన్ 27 :** తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానని, ఇప్పుడు దానిని పూర్తి చేసి జాతికి అంకితం చేసే బాధ్యత కూడా తనపైనే ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే గత పాలకులు కేవలం ప్రారంభోత్సవం చేసి చేతులు దులుపుకొన్నారని ఆయన విమర్శించారు. మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలోని కృష్ణంశెట్టి పల్లె (కె.ఎస్ పల్లె)లో శనివారం జరిగిన 'సంజీవని' కార్యక్రమ ప్రారంభోత్సవ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వెలిగొండ ప్రాజెక్టు అనేది మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు జీవనాడి వంటిదని, దానిని పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.ప్రాజెక్టు పూర్తికి ఇంకా రూ.3,900 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉందని చంద్రబాబు వివరించారు. పునరావాసం కింద నిర్వాసితులకు ఇప్పటికే రూ.300 కోట్లు విడుదల చేశామని, త్వరలోనే మరో రూ.600 కోట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. మొదటి విడతలో 1.19 లక్షల ఎకరాలకు, ఆ తర్వాత మిగిలిన ప్రాంతానికి పరిహారం చెల్లింపులు పూర్తి చేస్తామని తెలిపారు. కొందరు గొడ్డలి పార్టీకి పరోక్షంగా పనిచేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వాటిని - మిగతా 2 లో

# సంపాదకీయం

## లక్నో విషాదం...!



మూడువారాల్లో జరిగిన రెండు ఘోర అగ్నిప్రమాదాలు దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఢిల్లీ తరువాత ఇప్పుడు లక్నో వంతు. ఎన్నో ఆశలతో మంచి భవిష్యత్తు కోసం వచ్చిన పదిహేను మంది విద్యార్థుల ప్రాణాలు ఈ ప్రమాదంలో పోయాయి. సదరు యానిమేషన్ కోచింగ్ సెంటర్ తగలబడిపోవడానికి కారణాలు ఏమైనా ఉండవచ్చును కానీ, ప్రమాదతీవ్రతకు దారితీసిన పరిస్థితులు మాత్రం ఎప్పటిలాగానే అవే. మృతుల్లో అత్యధికులు దట్టమైన పొగలో ఉక్కిరిబిక్కిరవుతూ ఊపిరాడక కన్నుమూశారు. భద్రతకు సంబంధించి ఏ జాగ్రత్తలూ తీసుకోకుండా ఒక నివాసగృహాన్ని కమర్షియల్ కాంప్లెక్స్‌గా వాడటం ఈ దారుణానికి కారణం.అధికారుల నిర్లక్ష్యం, అవినీతి ఇటువంటి ప్రమాదాలకు దోహదం చేస్తాయి. నివాస భవనంగా అనుమతి పొంది, ఆ తరువాత కాలంలో ఆస్తి చేతులు మారాక అందులో వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు మొదలైనాయి. మరోపక్క నాలుగేళ్ళ క్రితం నుంచి లక్నో మునిసిపాలిటీ ఈ భవనం నుండి కమర్షియల్ ప్రాపర్టీ టాక్స్ వసూలు చేస్తున్నదట. అయితే తదనుగుణంగా ఆ భవన నిర్మాణంలో జరగాల్సిన మార్పుచేర్పుల ఊసుమాత్రం సదరు అధికారులకు పట్టలేదు. ఆఫీసులు, ప్రధానంగా పెద్దసంఖ్యలో విద్యార్థులకు శిక్షణనిచ్చే ఈ కోచింగ్‌సెంటర్ వంటివి ఉన్నప్పటికీ, మున్సిపల్ అధికారులకు దాని లోపాలు పట్టలేదు. ఒక ఇరుకుమార్గం గుండా రాకపోకలు సాగుతూ, ఫైర్‌సేఫ్టీ అనుమతులు, ఎమర్జెన్సీ ఎగ్జిట్ వంటి ఏర్పాట్లకు తావులేని ఈ మూడంతస్థుల భవనం మృత్యునిలయంగా పరిణమించింది. భవనంపైకి పరిగెత్తేందుకు వీల్లేకుండా ఆ దారిని సైతం మూసివేశారు.ఈ ప్రమాదం మనలను తీవ్రంగా హెచ్చరిస్తున్న మరో అంశం ఎలక్ట్రానిక్ లాకింగ్ సిస్టమ్. బయోమెట్రిక్ లాక్ అనో, స్మార్ట్‌లాక్ అనో పిలుచుకొనే ఈ వ్యవస్థ అగ్నిప్రమాదం జరగ్గానే ఆ భవనాలను మరింత ప్రమాదకరంగా మార్చివేసి, మృతుల సంఖ్య అత్యధికంగా ఉండటానికి కారణమవుతున్నది. మండుతున్న భవనాల్లో ఈ ఎలక్ట్రానిక్ డోర్ లాక్‌లు సులువుగా జామ్ అయిపోవడంతో, లోపల చిక్కుబడిపోయి మరణిస్తున్నవారి సంఖ్య అధికంగా ఉంటోంది. ఈ సాంకేతికత కారణంగా కన్నుమూసిన వారి సంఖ్య దేశంలో ఈ ఆర్నెల్లలోనే డజన్లకొద్దీ ఉన్నందున ఈ అంశంపై లోతైన అధ్యయనం జరిపి, వాటి వినియోగాన్ని ప్రమాదరహితంగా మార్చుకోవాలి. అత్యధిక వేడిమికి తాళాలు జామ్ అయిపోయి తీవ్రతను పెంచుతున్న పరిస్థితుల్లో, ఆ సంక్లిష్టతను దాటగల మెకానిజం అందులో ఉండాలి. వేడి పెరిగి, సదరు ఎలక్ట్రానిక్ లాక్ విఫలం కాగానే అది జామ్ కావడానికి బదులు తెరుచుకోగలిగితే ఎంతో ప్రాణనష్టాన్ని నివారించవచ్చు. ఎలక్ట్రానిక్ లాక్‌ల ఖరీదు క్రమంగా తగ్గిపోతూండటంతో ఇప్పుడు అనేక చోట్ల వాటిని విరివిగా వాడుతున్నారు. అందువల్ల, కొత్త టెక్నాలజీ ప్రమాదకారిగా పరిణమించకుండా, కష్టకాలంలో కాపాడేదిగా మనం దానిని మార్చుకోవాలి. ఒక మండుతున్న భవనంలో కేవలం ఈ తరహా వ్యవస్థ కారణంగా ఏ వ్యక్తీ కూడా భవిష్యత్తులో కన్నుమూయకుండా జాగ్రత్తపడాలి. ఈ కోచింగ్ సెంటర్ ప్రవేశమార్గంలో ఏర్పాటైన బయోమెట్రిక్ విధానమే పెద్దసంఖ్యలో విద్యార్థుల మరణానికి కారణమైన మాట వాస్తవం.తప్పించుకొనే దారిలేక పలువురు విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఫోన్లు చేసి కాపాడమంటూ అర్థించారట. స్థానికులు వీడియోలు తీయడంమీద పెట్టిన శ్రద్ధ, ఆర్తనాదాలు చేస్తున్న ఆ పిల్లలను కాపాడటంమీద పెట్టివుంటే ఎంతోమంది బతికిబయటపడివుండేవారని మరికొందరు వాపోయారు. ఇరవై అగ్నిమాపకయంత్రాలు, సహాయక బృందాలు సాధ్యమైనంత వెంటనే రంగంలోకి దిగి కూడా, ఇరుకైన మెట్లదారి వినా మరోమార్గం లేకపోవడంతో చాలామందిని కాపాడలేకపోయాయి. ఢిల్లీ మాలవీయనగర్‌లో ఇటీవల ఒక హోటల్ తగలబడిపోయి, ఇదే తరహాలో ప్రాణాలు పోయాయి. వ్యవస్థలన్నీ శ్రద్ధపెడితే కచ్చితంగా నివారించగల విషాదఘటనలు ఇవి. చదువులు, ఉద్యోగాలకోసం నగరాలకు తరలివస్తున్నవారి సంఖ్య పెరుగుతున్నకొద్దీ భవన యజమానుల డబ్బుయావ హెచ్చుతోంది, మనిషి ప్రాణానికి విలువలేకుండా పోతోంది. లక్నో ఘటన దేశానికి మరో హెచ్చరిక. వివిధ విభాగాలన్నింటి సమన్వయంతో, సమాచార మార్పిడితో, తనిఖీలు నిఘాలు పెంచి, లోపాయికారీ వ్యవహారాలకు తావులేని రీతిలో వ్యవహరించి ఇటువంటి విషాదాలు పునరావృతం కాకుండా చూడాలి.

# వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తనదే

మొదటిపేజీ తరువాయి - నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

**ఆగస్టు 15 నుంచి 'సంజీవని'**

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రూపొందించిన 'సంజీవని' కార్యక్రమాన్ని చంద్రబాబు ప్రారంభించారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇది ఒక సమగ్ర డిజిటల్ ఆరోగ్య వేదిక అని, దీని ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ సేవల వరకు మొత్తం ఆరోగ్య వ్యవస్థను అనుసంధానం చేస్తామని వివరించారు.ప్రెడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానాలతో ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తామని, సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులను భద్రపరుస్తామని తెలిపారు. ప్రజలు కూడా మంచి ఆహారం, వ్యాయామం, యోగా వంటి అలవాట్లతో ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

**బ్లేడు, గంజాయి బ్యాచ్‌లు రాబందుల్లా తిరిగాయి!**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని, వ్యవస్థలన్నీ విధ్వంసానికి గురయ్యాయని చంద్రబాబు ఆరోపించారు. నలుగురు వ్యక్తులు స్వేచ్ఛగా



మాట్లాడుకోలేని భయానక వాతావరణం ఉండేదని, బ్లేడు, గంజాయి బ్యాచ్‌లు రాబందుల్లా తిరిగాయని విమర్శించారు. నేడు ఆ పరిస్థితి మారిందని, ప్రజలు స్వేచ్ఛగా ఉన్నారని అన్నారు.

**రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా ఏర్పడ్డాయని స్పష్టం చేశారు.**

మహిళల కోసం స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2.0 వంటి పథకాలను అమలు చేస్తున్నామని, వచ్చే నెలలో 'తల్లికి వందనం' కింద తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని తెలిపారు. రైతుల కోసం మొదటి విడత నిధులు ఇప్పటికే విడుదల చేశామని గుర్తుచేశారు.

**యువత, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి**

రామాయపట్నం పోర్టును త్వరలోనే పూర్తి చేసి, పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చి, పండ్ల తోటలు, వాణిజ్య పంటలను ప్రోత్సహించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రైతులు విచ్చలవిడిగా పురుగుమందులు వాడటం వల్ల మన ఉత్పత్తులు అంతర్జాతీయంగా తిరస్కరణకు గురవుతున్నాయని, అందుకే ప్రకృతి సేద్యం వైపు మళ్లాలని సూచించారు. యువత ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలు నేర్చుకొని భవిష్యత్తుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. జనాభా తగ్గుదల వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని, ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలకు ప్రోత్సాహకాలు ఇచ్చే ఆలోచన చేస్తున్నట్లు చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రులు డీబీవీ స్వామి, ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసే వారికే పదవులు

మొదటిపేజీ తరువాయి -

ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జనసైనికులకు పలు సూచనలు చేశారు. జనసేవ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సభ్యుల ఎంపిక గురించి మాట్లాడారు.క్షేత్రస్థాయిలో పనిచేసే వారి వివరాలు, సమాచారాన్ని ఎప్పటికప్పుడు పారదర్శకంగా సేకరించడమే కమిటీల బాధ్యత అని పవన్ అన్నారు. కమిటీల ఎంపికపై కొందరు విమర్శలు చేస్తున్నారని, అది సరికాదని తెలిపారు. ఎన్నేళ్లుగా కష్టపడుతున్నారనే దాన్ని బేరీజు వేసుకునే ఎంపిక జరిగిందన్నారు. కమిటీలో ఉన్నవారికి త్వరలోనే విధివిధానాలు అందిస్తామన్నారు.ఏ ఉద్యమమైనా కొత్త తరానికి విస్తరించాలి: క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారాన్ని పవన్ దృష్టికి తేవాలన్నారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న వారిని గుర్తించాలని, అటువంటి కార్యకర్తలను నాయకత్వం గుర్తించకపోతే ఎలా అని పవన్ హితవు పలికారు. కార్యకర్త ఎదిగేందుకు మనమంతా సాయం చేయాలని, నిజమైన కార్యకర్తలపై ప్రేమ, అభిమానం చూపించాలన్నారు. పార్టీ కోసం నిస్వార్థంగా శ్రమించే వారికి గుర్తింపు ఇస్తామన్నారు.పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేసే వారికి మరిన్ని పదవులు వస్తాయని స్పష్టం చేశారు. జనసేన పార్టీలో 18 వేలమంది సాధక్‌లు ఉన్నారన్నారు. ఏ ఉద్యమమైనా కొత్త తరానికి విస్తరించాలని, లేకుంటే ఎదుగుదల ఉండదని పవన్ తెలిపారు. తాను చెప్పినట్లు ముందుకెళ్తే జనసేనకు కోటిమంది సభ్యులు ఉండేవారని, పార్టీ మహావృక్షంగా ఎదిగితే ఆ కొమ్మలపై మీరు కూర్చోవచ్చని పవన్ కల్యాణ్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.'కులాలతో రాజకీయాలు చేయను. చేయబోను. పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు దక్కుతాయి. అన్ని కులాలను కలుపుకుని వెళ్తేనే మనుగడ సాధించగలం. నేనెప్పుడూ కులాలను రాజకీయాలకు పెట్టుబడి పెట్టను. క్షేత్రస్థాయిలో పనిచేసే వారి వివరాలు ఎప్పటికప్పుడు సేకరిస్తాం. సమాచారాన్ని పారదర్శకంగా సేకరించడమే కమిటీల బాధ్యత. దేశవ్యాప్తంగా ఎస్టీ, ఎస్సీ, బీసీల పేరుతో హాస్టళ్లు ఉండకూడదు. పిల్లలందరికీ ఒకటే హాస్టల్ ఉండాలని కోరుకుంటున్నా. కులాలను కలపడం తప్ప విడగొట్టడం నాకు రాదు.వైఎస్సార్సీపీ నేతలు ఎప్పుడూ వ్యక్తిగతంగా దూషిస్తారని పవన్ ధ్వజమెత్తారు. 11 సీట్లు వచ్చినా వారు అలాగే మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సంక్షేమంపైనే ఆధారపడితే ఓట్లు రావని అభివృద్ధి కూడా చేయాలని సూచించారు. అందుకే వైఎస్సార్సీపీ బటన్ నొక్కినా ఓట్లు రాలేదని పవన్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులు సరిగా పనిచేయకే ప్రజలు ప్రైవేటుకు వెళ్తున్నారని, అందుకే ప్రభుత్వ వ్యవస్థలను బలోపేతం చేయాలని పదేపదే చెబుతున్నానన్నారు. కేంద్రం జల్‌జీవన్ మిషన్ నిధులిచ్చినా పనులు చేయాల్సింది రాష్ట్రాలేనని గుర్తు చేశారు.50 శాతం ఉన్న బీసీలకు ఒకరు ఇచ్చేదేంటి, కలిసి ఉంటే వాళ్లే ఇతరులకు ఇవ్వొచ్చు అని పవన్ అన్నారు. కులం అనే భావన ఎప్పుడూ ఇంటిగడప లోపలే ఆగాలని, గడప దాటాక మన సంస్కృతి, భాష, ధర్మం పాటించాలని సూచించారు. కృష్ణలంకలో చనిపోయిన రౌడీకి కులం అంటగట్టడమేంటని ప్రశ్నించారు. సాయికృష్ణ తల్లి బాధను అర్థం చేసుకోగలనన్నారు. తనను తిట్టేవాళ్లలో ఎక్కువమంది కాపు నాయకులే ఉన్నారని, ఎవరి భుజంపై తుపాకీ పెట్టి కాలుస్తున్నారో అందరూ చూస్తున్నారని వివరించారు. ఇష్టం వచ్చినట్లు తిట్టి, నేరాలు చేసి, కులం వెనుక దాక్కోవద్దని హెచ్చరించారు.

# రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

మొదటిపేజీ తరువాయి - ఫోర్-వీలర్లు అనే మూడు విభాగాల్లోనూ భారత్ ట్యాక్సీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయని అమిత్ షా తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సేవలు అందిస్తున్న ఈ ప్లాట్‌ఫామ్, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి కార్యకలాపాలు మొదలుపెట్టిందని వివరించారు. ఈ సంస్థ జాతీయ విస్తరణలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు.విస్తరణ ప్రణాళికల గురించి వివరిస్తూ.. రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా భారత్ ట్యాక్సీ వేగంగా కార్యకలాపాలు ప్రారంభిస్తుందని ఆయన అన్నారు. "ఈ వేదిక నుంచి నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. రాబోయే ఏడాదిన్నర నుంచి రెండేళ్లలోపు, మేము 500కు పైగా నగరాలకు చేరుకుంటాం. దేశంలో సేవలు అందని ప్రదేశమంటూ ఉండదు" అని అమిత్ షా నొక్కి చెప్పారు. జులై 31వ తేదీలోగా నాగ్‌పూర్,




పుణే, ముంబై, లక్నో, చండీగఢ్, జైపూర్, కోల్‌కతా వంటి ఏడు కీలక నగరాల్లో సేవలు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు.భారత్ ట్యాక్సీ ప్రత్యేకత సహకార నమూనా అని అమిత్ షా తెలిపారు. ఇందులో డ్రైవర్లు కేవలం కాంట్రాక్టర్లుగా కాకుండా సంస్థలో వాటాదారులుగా, సభ్యులుగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. "ఇప్పటికే సుమారు ఏడు లక్షల మంది 'సారథులు' (డ్రైవర్-సభ్యులు) భారత్ ట్యాక్సీ కుటుంబంలో భాగమయ్యారు. ఈ రోజు మీరు కూడా ఈ కుటుంబంలో చేరడం చాలా సంతోషంగా ఉంది" అని గుజరాత్‌లో కొత్తగా చేరిన సభ్యులను ఉద్దేశించి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'సహకారం ద్వారానే శ్రేయస్సు' అనే మంత్రాన్ని సాకారం చేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని అమిత్ షా పేర్కొన్నారు. మొబిలిటీ, రవాణా రంగాల్లో సహకార ఉద్యమాన్ని విస్తరించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. భారత్ ట్యాక్సీలో చేరడం ద్వారా డ్రైవర్లు తమ శ్రేయస్సు, గౌరవం, భద్రతకు మార్గం సుగమం చేసుకున్నారని ఆయన అన్నారు. భవిష్యత్తులో భారత రవాణా రంగంలో భారత్ ట్యాక్సీ ఒక ప్రధాన సహకార సంస్థగా ఎదుగుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# తెలంగాణకు చల్లని కబురు.. వారం రోజుల పాటు విస్తారంగా వర్షాలు!

మొదటిపేజీ తరువాయి - అందించింది. రుతుపవనాలు ఆలస్యంగా పుంజుకోవడంతో రాష్ట్రంలో వర్షపాతం కొరత ఏర్పడింది. అయితే, తాజాగా రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, దీని ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రానున్న ఏడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది.వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం.. నేడు ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేశారు. వీటితో పాటు హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా వర్ష సూచన నేపథ్యంలో వాతావరణ శాఖ తెలంగాణకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. జులై 2వ తేదీ వరకు వర్షాలు కొనసాగుతాయని పేర్కొంది. ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఒకటి రెండు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అదే సమయంలో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మాత్రం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలే నమోదయ్యే సూచనలు ఉన్నాయని వివరించింది.ఇక, రాజధాని హైదరాబాద్‌లోనూ వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండటంతో ఉక్కపోత నుంచి నగరవాసులకు ఉపశమనం లభించింది. ఈరోజు మధ్యాహ్నం తర్వాత తేలికపాటి జల్లులతో ప్రారంభమై, సాయంత్రం 6 గంటల తర్వాత వర్షం తీవ్రత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాత్రి వేళ నగరంలో భారీ వర్షం కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం,ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.

# ముందుకు 3 అడుగులు చుట్టూ 1 అడుగే

మొదటిపేజీ తరువాయి -

నిర్మించడానికి వీల్లేదు. స్లాబు ఎంత విస్తీర్ణం ఉండాలో ప్రభుత్వం విధివిధానాలు వెల్లడించింది. స్లాబు 700 చదరపు అడుగులకు మించరాదని స్పష్టం చేస్తూ గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు లక్ష ఇందిరమ్మ ఇళ్లు పూర్తి కాగా, మరో లక్ష ఇళ్లు ఈ సెప్టెంబర్ నాటికి పూర్తవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు రెండో విడత ఇళ్ల కేటాయింపునకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.స్థలం ఉన్న వారు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేస్తోంది. అయితే ఖర్చు ఎక్కువవుతోందని కొందరు మధ్యలో నిర్మాణాలు ఆపడం, మరికొందరు ప్రారంభించకపోవడాన్ని గుర్తించిన హౌసింగ్ కార్పొరేషన్ వ్యయంపై అధ్యయనం చేసింది. చాలా మంది స్లాబ్ ఎక్కువ సైజులో నిర్మిస్తున్నట్లు గుర్తించింది. కొంతమంది గోడల కన్నా సుమారు 8 అడుగుల వరకు ముందుకొస్తున్నట్లు హౌసింగ్ అధికారులు తెలిపారు. పెద్ద స్లాబు నిర్మించడం వల్ల ఖర్చు పెరిగి, కొందరు లబ్ధిదారులు అప్పులు చేయాల్సి వచ్చి నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేస్తున్నట్లు గుర్తించారు. దానివల్ల పేదలు ఇళ్లు నిర్మాణం కోసం సబ్సిడీ నిధులు ఇచ్చే ప్రధాన లక్ష్యమే దెబ్బతింటోందని ప్రభుత్వం పేర్కొంది.వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని స్లాబ్ విస్తీర్ణంపై పరిమితులు విధించాలని హౌసింగ్ కార్పొరేషన్ కోరడంతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటి ముందు వైపు గోడల కన్నా 3 అడుగులు, మిగతా వైపు ఒక అడుగు మాత్రమే స్లాబ్ ఉండాలని జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉదాహరణకు 400 చదరపు అడుగుల ఇంటికి 500 చదరపు అడుగుల వరకు, 600 ఎస్ఎఫ్‌టీ ఇంటికి 750 చదరపు అడుగుల వరకు మాత్రమే స్లాబు ఉండాలని పరిమితి విధించింది. ఇంటిలో ఎండ, వాన రాకుండా ఉండేందుకు స్లాబు పెంచడానికి బదులుగా తలుపులు, కిటికీల పైన సజ్జలు, సన్‌షేడ్‌లు నిర్మించేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని హౌసింగ్ కార్పొరేషన్ అధికారులకు ప్రభుత్వం తెలిపింది.ఎండ రాకుండా ఆర్‌సీసీ స్లాబు పెంచే బదులుగా అవసరమైతే రేకులు వేసుకునేలా లబ్ధిదారులకు వివరించాలని పేర్కొంది. కొత్తగా నిర్మించే ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇప్పుడు బేస్‌మెంట్, రూఫ్ లెవెల్‌లో ఉన్న నిర్మాణాలకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని ప్రభుత్వం వెల్లడించింది. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సిబ్బంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించింది.

# పరామర్శించేందుకు వెళ్లారా లేక రౌడీయిజం చేసేందుకు వెళ్లారా

మొదటిపేజీ తరువాయి - అనిత తీవ్రంగా స్పందించారు. అమరావతిలో అడుగుపెట్టే కనీస అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు. వారు రైతులను పరామర్శించడానికి వెళ్లారా లేక రౌడీయిజం చేయడానికా అని ప్రశ్నిస్తూ... వారి వెంట ఎంతమంది రౌడీషీటర్లు ఉన్నారో పోలీసుల వద్ద పక్కా లిస్ట్ ఉందని చెప్పారు. గతంలో టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన వారు కూడా వైసీపీ నేతల వెంట వచ్చారని... విజువల్స్ లో అందరూ ఉన్నారని తెలిపారు. వైసీపీ నేతలకు వ్యతిరేకంగా అక్కడ నిరసన తెలిపిన వారిలో 90 శాతం మంది రాజధాని కోసం భూములిచ్చిన అసలైన రైతులేనని స్పష్టం చేశారు.వైసీపీ అధినేత జగన్ గతంలో అమరావతిని అంగీకరించి, ఆ తర్వాత మూడు రాజధానుల డ్రామాలతో ఐదేళ్లు నరకం చూపించారని మండిపడ్డారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని అమరావతి రైతుల వద్దకు వస్తున్నారని ప్రశ్నించారు. అమరావతి పూర్తయితే వైసీపీకి మనుగడ ఉండదనే ఈ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అహర్నిశలు కష్టపడుతూ 2027 నాటికి అమరావతి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేయడమే టార్గెట్‌గా పెట్టుకుందన్నారు.

# 194 ఏళ్ల 'జోనాథన్'ను కలిసిన ప్రధాని మోదీ


మొదటిపేజీ తరువాయి - భేటీ అయ్యారు. సెషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మోదీ, ఈ సందర్భంగా అక్కడి జాతీయ బొటానికల్ గార్డెన్స్‌ను సందర్శించి ఈ అరుదైన జీవిని చూశారు.సుమారు 194 ఏళ్ల వయసున్న జోనాథన్, 1832లో జన్మించినట్లు అంచనా. ప్రస్తుతం వయసు రీత్యా కంటిచూపు మందగించడం, వాసన శక్తి తగ్గడం వంటి సమస్యలు ఉన్నప్పటికీ, అది ఆరోగ్యంగానే ఉంది. ఈ అల్డాబ్రా జాతికి చెందిన భారీ తాబేలు సెషెల్స్‌లో పర్యాటకులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పర్యావరణ పరిరక్షణకు చిహ్నంగా బొటానికల్ గార్డెన్స్‌లో ఒక మొక్కను నాటారు.భారత్, సెషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. సముద్ర భద్రత, బ్లూ ఎకానమీ, వాతావరణ మార్పుల నిరోధం వంటి కీలక అంశాల్లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. దౌత్యపరమైన పర్యటనలో ఇలాంటి ఆసక్తికరమైన సంఘటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# సౌదీ ప్రయాణికులకు బంగారంపై కొత్త నిబంధనలు

మొదటిపేజీ తరువాయి - సౌదీ అరేబియాకు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే ప్రయాణికుల కోసం ఆ దేశ ప్రభుత్వం కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. మనీలాండరింగ్ నిరోధక చర్యల్లో భాగంగా బంగారం, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు రవాణాపై నిబంధనలను మరింత కఠినతరం చేసింది. గతంలో ఉన్న 60,000 సౌదీ రియాల్స్ డిక్లరేషన్ పరిమితిని ప్రస్తుతం 40,000 రియాల్స్‌కు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది.సౌదీ అరేబియాలోని జకాత్, ట్యాక్స్ అండ్ కస్టమ్స్ అథారిటీ ఈ కొత్త నిబంధనలను అమలు చేస్తోంది. దీని ప్రకారం, ఎవరైనా 40,000 సౌదీ రియాల్స్ (సుమారు రూ. 10 లక్షలు) లేదా అంతకంటే ఎక్కువ విలువైన నగదు, బంగారం, విలువైన లోహాలు, రత్నాలు లేదా ఆభరణాలు తీసుకెళుతున్నట్లయితే కస్టమ్స్ అధికారులకు తప్పనిసరిగా రాతపూర్వక డిక్లరేషన్ సమర్పించాలి. వీటికి సంబంధించిన కొనుగోలు ఇన్‌వాయిస్‌లను కూడా అధికారులకు చూపించాల్సి ఉంటుంది.ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. సరైన వివరాలు వెల్లడించని పక్షంలో, సదరు వస్తువులను 72 గంటల పాటు తాత్కాలికంగా జప్తు చేస్తారు. మొదటిసారి నిబంధనలు ఉల్లంఘించిన వారికి (మనీ లాండరింగ్ ఉద్దేశం లేదని నిర్ధారణ అయితే), స్వాధీనం చేసుకున్న వస్తువుల విలువలో 10 నుంచి 25 శాతం వరకు జరిమానా విధిస్తారు. ఈ ఉల్లంఘన పునరావృతమైతే జరిమానాను 50 శాతానికి పెంచే అవకాశం ఉంది. ఒకవేళ నేరపూరిత ఉద్దేశాలు ఉన్నట్లు అనుమానిస్తే, సదరు కేసును పబ్లిక్ ప్రాసిక్యూషన్‌కు బదిలీ చేస్తారు.ఈ కొత్త నిబంధనలు భారత్ సహా ఇతర గల్ఫ్ దేశాలకు ప్రయాణించే ప్రవాసులపై ప్రధానంగా ప్రభావం చూపనున్నాయి. ప్రయాణికులు తమ వెంట తీసుకెళ్లే విలువైన వస్తువులకు సంబంధించిన అసలు రశీదులను భద్రపరుచుకోవాలని మరియు ప్రయాణానికి ముందు తాజా నిబంధనలను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ

మొదటిపేజీ తరువాయి - విజయఢంకా మోగించడమే బీజేపీ నెక్స్ట్ టార్గెట్ అని స్పష్టం చేశారు.హైదరాబాద్ నుంచే ఈ విజయానికి నాంది పలుకుతామని, వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ విజయం సాధించి చూపెడతామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు కలిసి



వచ్చినా సరే.. బీజేపీని ఓడించడం ఎవరి తరం కాదన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రేపు హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. మరోవైపు వరంగల్ లో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... బీజేపీ జాతీయ నాయకత్వం మొత్తం తెలంగాణ వైపే చూస్తోందని అన్నారు. ఈనెల 29న నితిన్ నబీన్ వరంగల్‌లో పర్యటిస్తారని, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బూత్ లెవెల్ కార్యకర్తల సదస్సులో పాల్గొంటారని వెల్లడించారు. బీజేపీని కాదని కాంగ్రెస్ ను గెలిపించిన ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టయిందని అన్నారు.

# ముగ్గురు సీఎంల రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయి

మొదటిపేజీ తరువాయి -కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు (చంద్రబాబు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్) జరిపిన రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో సీఎంలు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురు మాత్రమే కూర్చుని



ఏం చర్చించారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవలి, ఆంధ్రప్రదేశ్‌లో గుండ్రేవుల ప్రాజెక్టులు ముందుకు వెళుతుంటే, మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'చారిత్రక ఒప్పందం' అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు.గతంలో గుండ్రేవులను బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుందని... కానీ ఇప్పుడు ఏపీ సీఎం తన 'శిష్యుడు' రేవంత్ తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును తీసుకురావడం జరుగుతోందని ఆరోపించారు. ఆర్‌డీఎస్‌కు స్పష్టమైన నీటి కేటాయింపులు ఏమైనా వచ్చాయా అని ప్రశ్నించిన హరీష్ రావు... రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన కూడా లేదని ఎద్దేవా చేశారు. గత 60 ఏళ్లలో కాంగ్రెస్ సగటున 4 టీఎంసీలు మాత్రమే తెచ్చుకుంటే, బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున అనుమతులు తెచ్చుకున్నామని గుర్తు చేశారు."మనకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నాం. ఇంకా 138 టీఎంసీలు రావాలి. రేవంత్ రెడ్డి తెలంగాణను ముంచే ముంపు మేస్త్రి కావద్దు" అని వ్యాఖ్యానించారు.

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
RNI TGTEL/25/A5065



# రవీంద్రభారతిలో భక్తిభావం.. వైభవంగా 'నవ దుర్గలు - కాళీ మాత' కోలాట నృత్యోత్సవ కార్యక్రమం




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూన్ 27.** : తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా 87వ రోజు నిర్వహించిన కాళీ మాత మరియు కోలాట కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. జూన్ 26, 2026న రవీంద్రభారతిలోని "పాల్కురికి సోమన్న మూల" వేదికపై శ్రీమతి పోల రాణి నగర్ కర్నూల్ జిల్లా బృందం నవ దుర్గ కాళీ మాత గడ్డం స్పందన జనగాం జిల్లా కోలాట బృందం

**సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.**

కాళీ మాత అవతార వైభవం: దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం అమ్మవారు ఎత్తిన నవదుర్గల రూపాలను, ముఖ్యంగా కాళీ మాత రౌద్ర, కరుణా రసాలను కళాకారులు తమ నృత్య అభినయాల ద్వారా కళ్లకు కట్టారు. బోనాల కోలాట : సాంప్రదాయ బోనాల కోలటం నృత్యాలు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లయబద్ధమైన చప్పుళ్లు, కళాకారుల అడుగుల విన్యాసాలు తల పై బోనం పెట్టు కొని కోలాటం వేసారు పాల్కూరికి సోమన్న ములలో ఆధ్యాత్మిక ఉత్తేజాన్ని నింపాయి. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నర్సింహా రెడ్డి, ఐఏఎస్ నందిని సిద్ధారెడ్డి , నాళేశ్వరం శంకర్, కొండపల్లి నిహారిని, కందుకూరి శ్రీరాములు, బెల్లం కొండ సంపత్ గారు కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. భాషా సాంస్కృతిక శాఖ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లిడాక్టర్ పి.విజయ్ కుమార్ సాంస్కృతిక సలహా మండలి సభ్యులు శ్రీ ముచర్ల దినకర్ పాల్గొన్నారు. ప్రధాన కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు జానపద, సామాజిక చైతన్య గీతాలను ఆలపించి సభకు ఉత్సాహభరితమైన వాతావరణాన్ని కల్పించారు. వారి ప్రదర్శనలు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణను పొందాయి.

## ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**అంధుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. భాస్కర్**

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, జూన్-27 (వార్త సంధ్య)) :** 2026-27 విద్యా సంవత్సరానికి గాను కరీంనగర్‌లోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు (ఇంగ్లీష్ మీడియం,10వ తరగతి తెలుగు మీడియం) ప్రవేశానికి అర్హత గల అంధ బాలబాలికల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.?అర్హులైన దరఖాస్తుదారులు 06 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని, ఉత్తర తెలంగాణకు చెందిన అంధ బాలబాలికలు మాత్రమే ప్రవేశానికి అర్హులని, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన వారికి ప్రవేశంలో ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, ఈ పాఠశాలలో ఉచిత విద్య, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, పాదరక్షలు, వసతి గృహ సౌకర్యం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ?ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవడానికి సదరం,డిజబిలిటీ సర్టిఫికేట్, స్టడీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో కూడిన దరఖాస్తులను ప్రిన్సిపాల్, ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల, మల్యాలపూర్ రోడ్, శాత వాహన యూనివర్సిటీ ఎదురుగా, విజయపురి కాలనీ, కరీంనగర్ వారి కార్యాలయంలో సమర్పించాలని, మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళల్లో 9701190127,9440338424 ఫోన్ నెంబర్ల ద్వారా సంప్రదించాలని ప్రభుత్వ అందుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఫీజు రియంబర్స్మెంట్ ను విడుదల చేసి పేద విద్యార్థులను ఆదుకోండి

- ఎస్సీ ఎస్టీ విద్యార్థి యువజన సంఘం



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)జూన్ 27 :** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేసి పేద విద్యార్థుల ను ఆదుకోవాలని ఎస్సీ ఎస్టీ విద్యార్థి యువజన సంఘం డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు సర్దార్ సింగ్ విద్యార్థి సంగం నాయకులు సైదులు, శ్రీనివాసులు, రామకృష్ణ, సందీప్, మురళి లతో కలిసి మాట్లాడారు. ఫీజు రియంబర్స్మెంట్ సౌండ్ చెల్లించకపోవడంతో ఓవైపు విద్యార్థులతో పాటు లెక్చరర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఫీజు రీఎంబర్స్మెంట్ కాకపోవడంతో సర్టిఫికెట్లు అందక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ నోటిఫికేషన్లకు విద్యార్థులు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లలో రోస్టర్ ఉల్లంఘనలతో నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా బీసీ విద్యార్థుల పట్ల శాపంగా మారిన క్రిమిలేయర్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం విద్యా విధానంలో సైతం క్రిమిలేయర్ ను అమలు చేయడం పై మండిపడ్డారు. ఆధునిక యుగంలో సైతం విశ్వవిద్యాలయాల్లో కొనసాగుతున్న కుల వివక్షపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటు యూనివర్సిటీలను నియంత్రించడంతోపాటు ప్రస్తుతం విద్యనుభ్యసిస్తున్న ఎస్సీ ఎస్టీ విద్యార్థుల కోసం ప్రత్యేక ప్లేస్మెంట్ డ్రైవులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే విద్యార్థి నిరుద్యోగ యువజనుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనాని విజయవంతం చేయండి: డాక్టర్ పిడమర్తి రవి




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 27.** : జూన్ 28 ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. ఈరోజు ఎల్బీనగర్ లో మాదిగ యూత్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు నక్క మహేష్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళన గోడపత్రికను విడుదల చేసిన అనంతరం పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు భాగంగా 250 గజాల ఇంటి స్థలం ఉద్యమకారులకు గుర్తింపు కార్డు అదే విధంగా పింఛన్ ఇవ్వాలని ప్రధాన డిమాండ్ తో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉద్యమకారులు వేల సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. మాదిగ యూత్ జేఏసీ రాష్ట్ర నాయకులు రింగు రాంబాబు, తెలంగాణ దళిత దండు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రమళ్ళ మొగులయ్య, ఎస్సీ స్టూడెంట్స్ హాస్టల్ అసోసియేషన్ అధ్యక్షులు ముప్పూరి కుమార్, బిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్, బవండ్లపల్లి నరేష్, నక్క సుధీర్,జయేందర్ నాయక్, కళాకారులు పిడమర్తి రాంబాబు, ఎం భరత్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## శీతలా పరమేశ్వరి నాభిశిల - ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు



**చంద్రుగొండ ప్రతినిధి జూన్: 27(వార్త సంధ్య) :** దమ్మపేట మండలం గుర్వాయిగూడెం గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న శీతలా పరమేశ్వరి నాభిశిల (బొడ్రాయి) మరియు ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. గ్రామస్తులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆహ్వానం మేరకు మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మల్లేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం అక్రమాలపై 11 మందిపై కేసు నమోదు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**అక్రమాలకు పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మంథని,జూన్-27 (వార్త సంధ్య) :** మంథని మండలం మల్లేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగిన అక్రమాల వ్యవహారాన్ని జిల్లా యంత్రాంగం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సప్లైస్ శాఖ తనిఖీ నివేదికలు,పంచనామా, సంబంధిత అధికారుల నివేదికల ఆధారంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అధికారులు మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, 11 మందిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) ఎఫ్ఐఆర్ నం: 137 తేదీ : 25/06/2026 ,సెక్షన్లు 318(4),316(4),316(5),338,61(2) కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రాథమిక విచారణలో ట్యాబ్ ఆపరేటర్ నకిలీ ట్రక్ చిట్లు సృష్టించడం, కొనుగోలు రికార్డుల్లో అక్రమ నమోదులు చేయడం, స్టాఫ్ అసిస్టెంట్ అక్రమ ధాన్యం రవాణాకు సహకరించడం, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి ప్రమేయంతో కుట్రపూరితంగా వ్యవహరించినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న 11 మందిపై కేసు నమోదు చేయడంతో పాటు, దర్యాప్తులో మరెవరి ప్రమేయం వెలుగులోకి వచ్చినా వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తనిఖీల్లో మూడు లారీల్లో తరలిస్తున్న 2,213 బస్తాల (885.20 క్వింటాళ్లు) ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ఎనిమిది నకిలీ ట్రక్ చిట్ల ద్వారా 5,421 బస్తాల (2,168.40 క్వింటాళ్లు) ధాన్యాన్ని కొనుగోలు రికార్డుల్లో అక్రమంగా నమోదు చేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు పేర్కొన్నారు. రైతుల శ్రమను దోపిడీ చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పూర్తి పారదర్శకతను పాటించేలా అన్ని కొనుగోలు కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని,అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు శాఖాపరమైన చర్యలు కూడా తప్పవని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు.

# అన్నదాతల్లో ఆందోళన

**తూముల షట్టర్ల మరమ్మతుల్లో జాప్యం..**

**చెరువుల్లో నీటి నిల్వకు ముప్పు**

**పెనగడపలో మూడు ప్రధాన చెరువుల పరిస్థితి అస్తవ్యస్తం**

**800 ఎకరాల ఆయకట్టుపై ప్రభావం..**

**టెండర్లు పిలిచినా ప్రారంభం కాని పనులు**





**చంద్రుగొండ ప్రతినిధి జూన్: 27(వార్త సంధ్య) :** వర్షాకాలం ప్రారంభమైంది. చెరువుల్లో నీరు నిల్వ చేసి రైతులకు సాగునీరు అందించాల్సి ఉంది. కానీ, ఇప్పటికే చెరువుల తూముల షట్టర్లు పాడై పోయాయి. దీంతో అన్నదాతల పంటల సాగుకు నీరు సక్రమంగా అందే పరిస్థితి లేదు. అయినప్పటికీ ప్రభుత్వం, ఇరిగేషన్ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ కార్యక్రమంలో భాగంగా చెరువుల పూడికతీత చేపట్టి వర్షపు నీటిని నిల్వ చేసేలా చర్యలు తీసుకుంది. అయితే, ప్రస్తుతం ఆ చెరువులకు అమర్చిన తూముల షట్టర్లు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని బాగు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పెనగడపలోని కృష్ణాదేవరాయ చెరువు, ఎర్ర చెరువు, పెద్ద చెరువు కింద సుమారు 800 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఈ మూడు చెరువుల నుంచే ఏటా రెండు పంటలకు సాగునీరు అందుతుంది. భూగర్భ జలాలు కూడా సమృద్ధిగా నిల్వ ఉండి బోర్లు, మోటార్లకు నీరు లబి స్తోంది. అయితే, కొన్ని నెలలుగా ఈ మూడు చెరువుల తూముల షట్టర్లు పూర్తిగా దెబ్బతినడంతో చెరువుల్లో నీటిని నిల్వ చేయడం కష్టంగా మారిందని, వర్షపు నీరు వృథాగా పోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను స్థానిక రైతులు పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. షట్టర్ల మరమ్మతుల కోసం రూ.1.10 లక్షల అంతనా వ్యయం తో టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదని, దీంతో పనులు నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నారు. ఇది సింగరేణి ప్రభావిత ప్రాంతం కావడంతో జీకేవోసీ నుంచి విడుదల చేసే నీటిని కూడా ఈ చెరువుల్లోకి మళ్లిస్తుంటారు. షట్టర్ల సమస్యపై సింగరేణి అధి కారులు కూడా పలుమార్లు ప్రస్తావించినట్లు ఇరిగేషన్ ఏఈ ప్రసాద్ రావు తెలిపారు. అయితే, వర్షాకాలంలో కురిసే నీటిని చెరువుల్లో నిల్వ చేసి తమ పంటలకు అందించాలని, షట్టర్ల మరమ్మతులు పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

# జూలై 3 నాటికి ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**ప్రతి అర్హ ఓటరికి తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం అందేలా చర్యలు తీసుకోవాలి**

**గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు బీఎల్‌వోలకు సహకరించాలి**

**ప్రతి ఓటరికి రెండు ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వాలి.. ఒకటి రసీదుగా తిరిగి అందజేయాలి**

**ప్రగతి నగర్‌లో ఎస్ఐఆర్ ఓటరు నమోదు ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, జూన్-27 (వార్త సంధ్య) :** ఓటరు నమోదు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జులై 3వ తేదీలోపు ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం పెద్దపల్లి పట్టణంలోని 4 వ వార్డు ప్రగతి నగర్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ఆన్‌లైన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న ఫారాల పంపిణీ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. జులై 3 నాటికి ఫారాల పంపిణీ ప్రక్రియను పూర్తిస్థాయిలో ముగించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో బీఎల్‌వోలకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు పూర్తి సహకారం అందిస్తూ ఫారాల పంపిణీని వేగవంతం చేయాలని తెలిపారు. ప్రతి ఓటరికి రెండు ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని, ఒక ఫారాన్ని ఓటరు వివరాలతో నింపించి స్వీకరించగా, మరో ఫారంపై స్వీకరణ ధృవీ కరణ చేసి రసీదుగా ఓటరికి తిరిగి అందజేయాలని సూచించారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వ హించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఇంటికి చేరుకొని ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందిం చేలా అధికారులు, బీఎల్‌వోలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో పెద్దపల్లి తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మరో గర్వకారణం

**షూటింగ్‌లో రాష్ట్ర స్థాయిలో రాణించిన అన్నాచెల్లెళ్లు**

**స్వర్ణ పతకం సాధించిన ఐమన్ ముస్కాన్ పఠాన్**


**-- రాష్ట్ర స్థాయిలో మెరిసిన రేయాన్ పఠాన్**







**చంద్రుగొండ ప్రతినిధి జూన్: 27(వార్త సంధ్య) :** తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అన్నపురెడ్డిపల్లి మండలం, గుంపెన కొత్తూరు గ్రామానికి చెందిన అన్నాచెల్లెళ్లు మాస్టర్ రేయాన్ పఠాన్ మరియు మాస్టర్స్ ఐమన్ ముస్కాన్ పఠాన్ హైదరాబాద్‌లో జూన్ 20 నుండి జూన్ 28, 2026 వరకు నిర్వహించిన ౘxx తెలంగాణ రాష్ట్ర షూటింగ్ ఛాంపియన్‌షిప్ (రైఫిల్/పిస్టల్) పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.కొత్తగూడెం రైఫిల్ అసోసియేషన్ షూటింగ్ రేంజ్‌లో శిక్షణ పొందుతున్న మాస్టర్స్ ఐమన్ ముస్కాన్ పఠాన్, 50 మీటర్ల ఓపెన్ సైట్ రైఫిల్ ప్రోన్






జూనియర్ ఉమెన్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అలాగే .177 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ యూత్ ఉమెన్ విభాగంలో పీూ సాధించి, సౌత్ జోన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ మరియు ఆల్ ఇండియా జి.వి. మావళంకర్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించింది. ప్రస్తుతం ఆమె దమ్మపేటలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతోంది.ఈ విజయంపై గోల్డ్ మెడలిస్ట్ ఐమన్ ముస్కాన్ పఠాన్ మాట్లాడుతూ, సరైన సదుపాయాలు లేకపోయినా తన తండ్రి మరియు కోచ్ అబ్దుల్ నబీ సహకారంతో, రాజాూ ఎలక్ట్రానిక్ ట్రెనింగ్ సిస్టమ్ ద్వారా క్రమశిక్షణతో సాధన చేసి ఈ విజయాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, డీఎస్పీ ఆదినారాయణ, సీఐ శ్రీదేవి, ఎస్ఐ విజయ్ సింహా రెడ్డి గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిభావంతులైన యువ క్రీడాకారుల అభివృద్ధి కోసం 50 మీటర్లు మరియు 300 మీటర్ల షూటింగ్ రేంజ్‌లు ఏర్పాటు చేసి, అవసరమైన స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి మరెందరో యువ షూటర్లు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో రాణించి జిల్లా, రాష్ట్రాలకు మరిన్ని పతకాలు సాధించి పేరు ప్రతిష్ఠలు తీసుకువస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా ఆమె అన్నయ్య మాస్టర్ రేయాన్ పఠాన్, ప్రస్తుతం మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐఎంఎల్ రెండవ సంవత్సరం చదువుతూ, 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ జూనియర్ మెన్ విభాగంలో పీూ సాధించాడు. ఈ ఘనతతో అతను కూడా సౌత్ జోన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ మరియు ఆల్ ఇండియా జి.వి. మావళంకర్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించాడు. ఇద్దరు షూటర్లు కూడా రాబోయే సౌత్ జోన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ మరియు ఆల్ ఇండియా జి.వి. మావళంకర్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

### పిల్లల విజయాలపై తండ్రి ఆనందం



ఈ సందర్భంగా వారి తండ్రి రహీమ్ పఠాన్ మాట్లాడుతూ, తన పిల్లలు షూటింగ్ క్రీడను కెరీర్‌గా ఎంచుకుని రాష్ట్ర స్థాయిలో ఇంతటి విజయాలు సాధించడం ఎంతో గర్వకారణమని తెలిపారు. రాబోయే సౌత్ జోన్ మరియు జాతీయ స్థాయి పోటీలలో కూడా వారు మరింత మెరుగైన ఫలితాలు సాధించి జిల్లా, రాష్ట్రం, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పిల్లల ప్రతిభను గుర్తించి, వారికి నిరంతర ప్రోత్సాహం అందిస్తూ ఈ స్థాయికి చేరుకోవడంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమిత్ సంఘీ, టీఆర్ఏ జాయింట్ సెక్రటరీ జె. కిరణ్, ఆంధ్రప్రదేశ్ రైఫిల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రాజ్ కుమార్, కొత్తగూడెం రైఫిల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మరియు కోచ్ అబ్దుల్ నబీ, టీఆర్ఏ బోర్డు సభ్యులు అడ్వకేట్ శ్రవణ్, వంశీ, ఎ. కిరణ్, అలాగే రాజాూ షూటింగ్ కోచ్ సందీప్ గార్లకు పఠాన్ కుటుంబం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. వారి మార్గదర్శకత్వం, ప్రోత్సాహం, సహకారం లేకుండా ఈ విజయాలు సాధ్యమయ్యేవి కావని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

**విజయాల ముఖ్యాంశాలు : -**

మాస్టర్స్ ఐమన్ ముస్కాన్ పఠాన్ -- 50 మీటర్ల ఓపెన్ సైట్ రైఫిల్ ప్రోన్ జూనియర్ ఉమెన్ విభాగంలో స్వర్ణ పతకం మాస్టర్స్ ఐమన్ ముస్కాన్ పఠాన్ .177 ఓపెన్ సైట్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ యూత్ ఉమెన్ విభాగంలో పీూ మాస్టర్ రేయాన్ పఠాన్ -- 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ జూనియర్ మెన్ విభాగంలో పీూ

**ఇద్దరూ సౌత్ జోన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్కు అర్హత**

ఇద్దరూ ఆల్ ఇండియా జి.వి. మావళంకర్ షూటింగ్ ఛాంపియన్‌షిప్కు ఎంపిక తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణిస్తున్న రేయాన్ పఠాన్ మరియు ఐమన్ ముస్కాన్ పఠాన్ విజయాలు యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి.

# రేగళ్ల పెద్దతండాలో ముమ్మరంగా ఎస్ ఐ ఆర్ కార్యక్రమం

**అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం : సర్పంచ్ లావుడ్య పూర్ణ**



**చంద్రుగొండ, జూన్ 27 (వార్త సంధ్య):** చంద్రుగొండ మండలం రేగళ్ల పెద్దతండా గ్రామ పంచాయతీ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ లావుడ్య పూర్ణ ఆధ్వర్యంలో విస్తృతంగా నిర్వహించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ూ×= నమోదు దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావుడ్య పూర్ణ మాట్లాడుతూ, ఓటు హక్కు భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు. ప్రతి అర్హత కలిగిన వ్యక్తి తన ఓటు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకుని ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు. ఇంటింటికీ అందజేస్తున్న ఎస్ఐఆర్ ఫారాలను ఎలాంటి తప్పులు లేకుండా పూర్తిగా నింపి సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బి ఎల్ ఓ)కు అందజేయాలని సూచించారు. ప్రజలకు ఫారాలు నింపడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ పంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఇందుకోసం ఐదుగురు విద్యావంతులైన యువకులను నియమించి, ప్రతి ఇంటికి వెళ్లి ఫారాలను సక్రమంగా నింపేందుకు సహకారం అందిస్తున్నామని వెల్లడించారు. ఈ ఏర్పాటుతో వృద్ధులు, నిరక్షరాస్యులు, దివ్యాంగులు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు.

# సీసీ రోడ్డును ప్రారంభించిన ఎక్లాస్ పూర్ సర్పంచ్ బొడ్డు రజిత శ్రీనివాస్



**మంథని, జూన్ 27(వార్త సంధ్య) :** రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మరియు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు ఆదేశాల మెరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్ ) నిధుల ద్వారా మంథని మండలం ఎక్లాస్ పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో 1వ వార్డ్ లో ప్రైమరీ స్కూలు నుండి తోట శ్రీనివాస్ ఇంటి వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులు ఎక్లాస్ పూర్ సర్పంచ్ బొడ్డు రజిత శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు బండి లావణ్య శంకర్, పంచిక దేవేందర్, గంట ప్రశాంత్,గుడిమల్ల తిరుపతి, గువ్వల రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెరవేన లింగయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ పెండ్లి ప్రభాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ సెక్రటరీ పెరవేన రాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాధారపు నితీష్ ,గ్రామ కార్యదర్శి,ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# నాటు సారా అమ్ముతూ పట్టుబడిన ఐదుగురిని బైండోవర్ చేసిన ఎక్సైజ్ ఎస్సై



**మంథని, జూన్ 27 (వార్త సంఖ్య) :** మంథని నియోజకవర్గంలోని ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్,ఓడేడు,సర్వారం,ఖమ్మం పల్లి,పోతారం గ్రామాలలో గతంలో నాటు సారాయి అమ్ముతూ పట్టుబడిన 5 గురు వ్యక్తులను శనివారం ముత్తారం మండలం తాహసిల్దార్ ఎదుట ఒక సంవత్సర కాలానికి ఒక లక్ష రూపాయలు జమానత్ కి బైండోవర్ చేశారు .ఈ కార్యక్రమంలో ఎస్సై సాయికుమార్, ట్రైనింగ్ ఎస్సై సంతోష్ మరియు సిబ్బంది భగవాన్ నాయక్,సునీల్, రవి పాల్గొన్నారు.

# రైతు భరోసా పథకం కింద దరఖాస్తుల స్వీకరణ

**మండల వ్యవసాయ అధికారి డా "డి.నవ్య**



**మంథని, జోన్ 27 (వార్త సంధ్య) :** మంథని మండలం లోని కొత్త పట్టదారు పాస్ పుస్తకాలు పొందిన అర్హులైన రైతుల నుండి రైతు భరోసా పథకం కింద దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం అయినట్టు మండల వ్యవసాయ అధికారి డా.డి .నవ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నాటికి భూ భారతి ఆధారంగా పాస్ పుస్తకాలు పొందిన రైతులు మాత్రమే దరఖాస్తుకు అవకాశం ఉందని తెలిపారు. కావలసినవి : రైతు దరఖాస్తు ఫారం,బ్యాంక్ పాస్ బుక్, పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, మరియు ఫోటోస్ తమ విస్తరణ అధికారులు వద్ద , దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే రైతు బరోసా పథకంలో నమోదైన రైతులు మళ్ళీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్రృస్టం చేశారు.

# ప్రముఖ దర్శకుడు, నటుడు కె. భాగ్యరాజ్ మృతికి తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తీవ్ర సంతాపం

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 27 :** తెలుగు, తమిళ సినీ పరిశ్రమలో దర్శకుడు, నటుడు, రచయితగా విశిష్ట సేవలు అందించిన ప్రముఖ సినీ దిగ్గజం కె. భాగ్యరాజ్ మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్, సమాచార పౌరసంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ జి. ముకుంద రెడ్డి సంయుక్త ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. భారతీయ సినీ రంగంలో తనదైన కథన శైలి, అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో ప్రత్యేక గుర్తింపు పొందిన భాగ్యరాజ్ ను సినీ ప్రపంచం "కింగ్ ఆఫ్ స్క్రీన్‌ప్లే"గా గౌరవించిందన్నారు. దర్శకుడిగా, నటుడిగా, రచయితగా అనేక చిత్రాల ద్వారా ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. తెలుగు ప్రేక్షకులతో కూడా ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉందని, ఆయన సినీ సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా భాగ్యరాజ్ కుటుంబ సభ్యులకు, అభిమానులకు, తమిళ సినీ పరిశ్రమకు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యతనివ్వాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి జిల్లాలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్**





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, జూన్ 27(వార్త సంధ్య) :** అభ్యసన ఫలితాలు పనితీరు గ్రేడింగ్ సూచికలు, లెర్నింగ్ మేనేజ్‌మెంట్, సమర్థవంతమైన తరగతి గది బోధనపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ?శనివారం పెద్దపల్లిలోని వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, నాణ్యమైన విద్యలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రం లోనే మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థులు స్వతంత్రంగా చదవడం, మాట్లాడడం నేర్చుకున్న అంశాలను సృజనాత్మకంగా వ్యక్తపరిచేలా తీర్చిదిద్దాలని కోరారు. ప్రతి పాఠశాలలో వార్షిక విద్యా ప్రణాళిక, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక,పాఠ్య ప్రణాళికలను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి రెమెడియల్ బోధన అందించాలని స్పష్టం చేశారు. డిజిటల్ వనరులు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తరగతి గదుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని చెప్పారు.?విద్యార్థుల విద్యా ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఆ సమాచారాన్ని ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో క్రమం తప్పకుండా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. శాఖ మార్గదర్శకాల ప్రకారం ఉపాధ్యాయుల బోధనా ప్రక్రియను మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. ?ఈ సమావేశంలో జిల్లా అకాడమిక్ ప్యానల్ తనిఖీ బృంద సభ్యులను కలెక్టర్ పరిచయం చేయగా, హాజరైన ఉపాధ్యాయులకు అకాడమిక్ ప్లానింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సమీక్షా సమావేశానికి జిల్లా వ్యాప్తంగా 14 మండలాల నుండి సుమారు 1000 మంది ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా విద్యా శాఖా ఏఎంఓ డాక్టర్. పిఎం. షేక్, సెక్టోరల్ అధికారులు మల్లేశ్, జిసిడిఓ కవిత, అలోకిట్, ఆర్పీ సమీర్, ఇతర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణిలో బొగ్గు మాయం అనే ప్రచారం దుర్మార్గం - ఖండించిన ఏఐటియుసి.

**అధికారులు టార్గెట్ కోసం అదనపు బొగ్గు కలిపారు తప్ప మాయం కాదు.**

**మెడికల్ బోర్డు ఆపింది రాష్ట్ర ప్రభుత్వమే - కాంగ్రెస్ హయాంలో రాజకీయ జోక్యం పెరిగింది.**

**కార్మికుల హక్కుల సాధన కోసం అవసరమైతే సమ్మె - వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్ కుమార్**



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, గోదావరిఖని, జూన్ 27 (వార్త సంధ్య) :** సింగరేణిలో బొగ్గు మాయమైందని బీజేపీ, బీఆర్ఎస్, టీఆర్ఎస్ రాజకీయ పార్టీలు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని, దుర్మార్గమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ ఖండించారు. శనివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన కోసం పట్టించుకోకుండా రాజకీయ పార్టీలు బాయి బాటలు పడుతూ సంస్థపై దుష్ప్రచారం చేస్తున్నాయని వారు మండిపడ్డారు. సింగరేణి లో టార్గెట్ రీచ్ కోసం అధికారులు అదనంగా బొగ్గు కలిపి చూపించడం వాస్తవమేనని, కానీ అది సరైన విధానం కాదని వారు అంగీకరించారు. అయితే బొగ్గు మాయమైందనే ప్రచారం మాత్రం బూటకమని వారు స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 75 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని అప్పుడు కాంగ్రెస్ నాయకులు ఆరోపించారని, ఇప్పుడు అదే నాయకుడు బీఆర్ఎస్‌లో ఉన్నారని వారు గుర్తు చేశారు. అదేవిధంగా సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటియుసి ఎప్పుడూ ముందుంటుందని వారు తెలిపారు. యాజమాన్యం సమ్మె నోటీసు లోని డిమాండ్లను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని అవసరమైతే సమ్మెకు వెళ్తామని వారు హెచ్చరించారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూన్ 8న యాజమాన్యానికి 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఈ నెల 25న హైదరాబాద్ లోని ఆర్.ఎల్.సి వద్ద చర్చలు జరిగాయని, జూలై 10లోపు యూనియన్ తో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని ఆర్.ఎల్.సి యాజమాన్యానికి సూచించినట్లు వారు వివరించారు. అదేవిధంగా సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహణను ఆపింది యాజమాన్యం కాదని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని వారు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సింగరేణిలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయిందని వారు ఆరోపించారు. అదేవిధంగా సింగరేణిలో 12వ వేజ్ బోర్డు సాధన కోసం అన్ని సంఘాలను కలుపుకొని ఉద్యమం చేస్తామని, కొత్త గనుల ఏర్పాటు కోసం ఏఐటియుసి ముందుండి పోరాటం చేస్తుందని ప్రకటించారు. 2014 నుండి సింగరేణికి చెందిన సి.ఎస్.ఆర్, డి.ఎం.ఎఫ్.టి నిధులు ఇతర ప్రాంతాలకు తరలి పోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ మూలంగానే సింగరేణి బొగ్గు పరిశ్రమ సర్వనాశనమైందని, టీఆర్ఎస్ హయాంలోనే సింగరేణికి చెందిన బొగ్గు బ్లాకులను అమ్ముకున్నారని వారు విమర్శించారు. ఏఐటియుసి అంటేనే పారదర్శకతకు కేరాఫ్ అడ్రస్ అని నొక్కి చెప్పారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు మడ్డి ఎల్లా గౌడ్, వై.వి. రావు, కే. వీరబద్రం, కే. స్వామి, రాజరత్నం, రాంచందర్, గౌతమ్ గోవర్ధన్, రంగు శ్రీను, గంధం సాంబశివరావు, టి. రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


# సొసైటీల పేరుతో డబ్బుల వసూళ్లు

**బాధితుల ఫిర్యాదులతో కలకలం**

**మహిళలకు పదవులు, ఉద్యమకారులకు పోరాటాలు**

**తప్పుడు చిరునామాలు, నకిలీ సంతకాలతో సంస్థల నమోదు**

**సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 27 (వార్త సంధ్య):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలు సొసైటీలు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యమ సంస్థల పేరుతో సభ్యత్వాలు, పదవులు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేశారంటూ ఒక వ్యక్తిపై పలువురు మహిళలు, తెలంగాణ ఉద్యమకారులు లిఖితపూర్వకంగా ఆరోపణలు చేశారు. తమ వద్ద సంబంధిత రసీదులు, లేఖలు, ఇతర ఆధారాలు ఉన్నాయని బాధితులు పేర్కొంటూ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. బాధితులు అందించిన లిఖితపూర్వక ఫిర్యాదుల ప్రకారం, గతంలో వివిధ రాజకీయ పార్టీల్లో పనిచేసిన నరాల సత్యనారాయణ అనే వ్యక్తి అనంతరం పలు సంస్థలను ఏర్పాటు చేసి, అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యుడు తదితర పదవులు ఇస్తానని చెప్పి పలువురి నుంచి వేల నుంచి లక్షల రూపాయల వరకు నగదు వసూలు చేశారని ఆరోపించారు. కొందరు మహిళలకు "సఖి" పేరుతో స్వచ్ఛంద సంస్థలో కీలక పదవులు ఇప్పిస్తామని, మరికొందరు ఉద్యమ కారులకు ప్రత్యేక గుర్తింపు కల్పిస్తామని నమ్మబలికినట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. బాధితుల వాదన ప్రకారం, డబ్బులు చెల్లించిన తర్వాత హామీ ఇచ్చిన పదవులు ఇవ్వకపోవడంతో తాము ప్రశ్నించగా వివిధ కారణాలు చెబుతూ కాలయాపన చేశారని తెలిపారు. అనంతరం డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినప్పుడు స్పందించలేదని, కొందరిని బెదిరించే విధంగా మాట్లాడిన సందర్భాలు కూడా ఉన్నాయని ఆరోపించారు. ఈ ఆరోపణలు స్వతంత్రంగా ఇంకా నిర్ధారించ బడలేదు. తెలంగాణ ఉద్యమకారుల వేదిక పేరుతో కొత్త సొసైటీని తప్పుడు చిరునామాతో నమోదు చేశారని, కొందరి సంతకాలను అనుమతి లేకుండా వినియోగించారని కూడా బాధితులు తమ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. దీనివల్ల ఉద్యమకారుల విశ్వసనీయత దెబ్బతిన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని సంబంధిత అధికారులను కోరు తున్నారు. పలువురు బాధితులు మాట్లాడుతూ, పదవులు, గుర్తింపు, సేవా కార్యక్రమాల పేరుతో ప్రజల విశ్వాసాన్ని పొందిన తర్వాత ఆర్థిక లావాదేవీలు జరిగాయని, తమలాగే మరెవరూ మోస పోకుండా ఉండాలని ఈ విషయాన్ని వెలుగులోకి తీసు కొస్తున్నామని తెలిపారు. తమ వద్ద ఉన్న పత్రాలు, రసీదులు, బ్యాంకు లావాదేవీల వివ రాలు, లిఖితపూర్వక ప్రకటనలను అవసరమైతే విచారణ అధి కారులకు సమర్పిస్తామని పేర్కొన్నారు. సామాజిక సేవ, ఉద్యమాల పేరుతో ఏర్పడే సంస్థల్లో చేరే ముందు ప్రజలు సంబంధిత సంస్థ రిజిస్ట్రేషన్, నిర్వాహకుల వివరాలు, ఆర్థిక లావాదేవీల పారదర్శ కతను పరిశీలించాలని పలువురు సూచిస్తున్నారు. పదవుల కోసం లేదా సభ్యత్వాల కోసం నగదు చెల్లించే ముందు అధికారిక రసీదులు, చట్టబద్ధతను ధృవీకరించు కోవాలని కూడా సూచిస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తి స్పందన కోసం ప్రయత్నించగా, ఈ కథనం సిద్ధం చేసే సమయానికి ఆయన స్పందన అందలేదు. ఆయన స్పందన అందిన వెంటనే దానిని కూడా ప్రచురించడానికి అవకాశం కల్పిస్తామని వార్త సంధ్య తెలియజేస్తోంది.

# విశ్వబ్రాహ్మణ కులాన్నే మాయం చేసే కుట్ర

**రాజ్యాధికారంలో వాటా అడుగుతారని భయం**

**అందుకే జనాభా లెక్కల్లో వేర్వేరుగా లెక్కలు**

**డిమాండ్ల సాధనకు త్వరలో కార్యాచరణ**

**రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)జూన్ 27:** విశ్వబ్రాహ్మణుల కులాన్ని మాయం చేసే కుట్రలో భాగంగానే పాలకులు కులగణనలో అయిదు వృత్తులను వేర్వేరు కులాలుగా నమోదుచేశారని ఆ సామాజిక వర్గం ప్రముఖులు, మేధావులు ఆరోపించారు. సృష్టి ఆరంభం నుంచీ మానవాళికి దిక్సూచిగా ఉన్న విశ్వకర్మల లెక్కలు తేలితే... ఎక్కడ రాజ్యాధికారంలో వాటాలు ఇవ్వాల్సి వస్తుందోనన్న భయంతోనే అగ్రకులాలు, పాలకులు కలిసి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. విభజించు-పాలించు అనే సూత్రాన్ని అమలుచేస్తూ... ఏకంగా విశ్వబ్రాహ్మణ కులాన్ని విడగొట్టి విచ్ఛిన్నం చేయడానికి ఉద్దేశపూర్వకంగానే అయిదు వృత్తులను అయిదు కులాలుగా కులగణనలో చూపించే యత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం తొలి శాసనసభాపతి, ప్రస్తుత శాసనమండలిలో ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మెట్రో ఈవినింగ్స్ పత్రిక చీఫ్ ఎడిటర్ దేవరకొండ కాళిదాస్, విశ్వకర్మ ఫౌండేషన్ అధ్యక్షుడు అద్లూరి రవీంద్రాచారి, పెద్దలు దాసోజు గోవర్ధన్ చారి, కుందారం గణేశ్‌చారి, బీసీ సంఘం రాష్ట్ర నేత సీనియర్ పాత్రికేయులు జూలూరి గౌరీ శంకర్, మదన్‌మోదన్, బొడ్డుపల్లి సుందర్, యాదగిరి, తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ మేరకు పలు తీర్మానాలపై చర్చ జరిగింది. డీకే పబ్లికేషన్స్ అధినేత దేవరకొండ కాళిదాస్ ప్రారంభోపన్యాసం చేస్తూ...

కుట్రపూరితంగానే అయిదు వృత్తుల వారిని వేర్వేరు కులాలుగా గుర్తించి, విశ్వబ్రాహ్మణ కులాన్ని బలహీనపర్చారని పేర్కొన్నారు. విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అద్లూరి రవీంద్రాచారి ముగింపు ఉపన్యాసం చేస్తూ, అన్ని జిల్లాల విశ్వకర్మ ప్రముఖులతో జులై 7న మరో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ... అధికారం, సంపద అంతా కూడా అగ్రకులాల ఆధీనం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాలలో విశ్వకర్మల జనాభా అసలు లెక్కలు తేలితే... రాజ్యాధికారంలో వాటా అడుగుతారన్న భయంతోనే... అయిదు వృత్తులు చేస్తున్న విశ్వబ్రాహ్మణులను అయిదు వేర్వేరు కులాలుగా గణిస్తున్నారని తెలిపారు. నేడు ఎన్నికల ముఖచిత్రం చూస్తే... కేవలం 2-3 శాతం ఓట్ల తేడాలో ప్రభుత్వాలు తారుమారు అవుతున్నాయని చెప్పారు. అందుకే తెలంగాణలో 4-5 శాతం జనాభా ఉన్న విశ్వబ్రాహ్మణులను విభజిస్తున్నారని విమర్శించారు. కాబట్టి... విశ్వకర్మీయులే తమ కులగణనకు సర్వే నిర్వహించాలని ఆయన సూచించారు.

## పెంబట్లలో అంబరాన్నంటిన
## మొహర్రం వేడుకలు: భక్తిశ్రద్ధలతో ముగిసిన పీర్ల పండుగ



**సారంగాపూర్ మండలం (వార్త సంధ్య) జూన్ 27 :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల పరిధిలోని పెంబట్ల గ్రామంలో మొహర్రం (పీర్ల పండుగ) వేడుకలు అత్యంత వైభవంగా, కోలాహలంగా జరిగాయి. కులమతాలకు అతీతంగా గ్రామ ప్రజలందరూ ఏకమై ఈ ఉత్సవాల్లో భారీ సంఖ్యలో పాల్గొన్నారు.గ్రామంలో పండుగ వాతావరణం ఉత్సవాల సందర్భంగా పెంబట్ల గ్రామంలో పండుగ క్రేజ్, జోష్ అంబరాన్నంటాయి.భారీగా తరలివచ్చిన జనం: పీర్ల ఊరేగింపును తిలకించడానికి మహిళలు, పురుషులు, వృద్ధులు , చిన్నారులు వీధులన్నిటా కిక్కిరిసిపోయారు.పులి వేషాల సందడి: వేడుకల్లో భాగంగా యువకులు ప్రత్యేకంగా వేసుకున్న సాంప్రదాయ పులి వేషాలు (టైగర్ డ్యాన్స్) , ప్రత్యేక నృత్యాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి.భక్తుల మొక్కులు - ఆశీస్సులు: గ్రామస్తులు పీర్లను దర్శించుకుని, ధూపదీప నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు.హిందూ-ముస్లిం ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఈ మొహర్రం వేడుకలు పెంబట్ల గ్రామంలో ఎంతో సంతోషకరమైన, భక్తిరస పూరితమైన వాతావరణంలో ముగిశాయి.

## అన్నపురెడ్డిపల్లిలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**- ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**



**చంద్రుగొండ ప్రతినిధి జూన్: 27(వార్త సంధ్య) :** అశ్వారావుపేట నియోజకవర్గంలోని అన్నపురెడ్డిపల్లి మండలంలో శనివారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పర్యటించి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి పథకాల కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని మర్రిగూడెం, అన్నపురెడ్డిపల్లి, అబ్బుగూడెం గ్రామపంచాయతీల్లో పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరిస్తున్న బీఎల్‌వోల పనితీరును పరిశీలించి, కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న ప్రతి యువతీ, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే ఓటు హక్కు ఉన్న వారి పేర్లు ఎలాంటి కారణాలతోనూ జాబితా నుంచి తొలగిపోకుండా బీఎల్‌వోలు, బూత్ లెవల్ ఏజెంట్లు సమన్వయంతో పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు కూడా తమ వివరాలను సక్రమంగా అందించి ఓటరు జాబితా ప్రక్షాళన కార్యక్రమానికి సహకరించాలని కోరారు. అనంతరం శాంతినగర్, ఎర్రగుంట గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న పాఠశాల ప్రహరీ గోడలు, వీఓ భవనాలు, భవిత భవనాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పర్సా వెంకట్, సీనియర్ నాయకులు వనమా గాంధీ, భానోత్ భీముడు, వేముల రమణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల నరేష్, ఎంఆర్ఓ స్వర్ణ, ఎంపీడీఓ, పీసీసీ జిల్లా సభ్యుడు వీరబోయిన నాగేశ్వరరావు, దుబ్బాకుల రాము, మరకాల లక్ష్మారెడ్డి, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు బాజీబాబా, బాలసాని శ్రీను, కోండ్రు రత్నం బాబు తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో ముమ్మరంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ



**వార్తా సంధ్య కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ విస్తృతంగా కొనసాగుతోంది. శనివారం నియోజకవర్గంలో జరుగుతున్న ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, సర్కిల్ ఉప కమిషనర్ (డీసీ) ఆంజనేయులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. బాలాజీనగర్ డివిజన్ వివేకనగర్ కాలనీలో బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలను అందజేశారు. ఒక్కో ఓటరు పేరుతో ప్రింట్ అయిన రెండు పత్రాలలో వివరాలను నమోదు చేసి, ఒక పత్రాన్ని ఓటరుకు ఇచ్చి, మరో పత్రాన్ని కంప్యూటర్లలో అప్‌లోడ్ చేసేందుకు అధికారులు సేకరించారు. ఈ ప్రక్రియను డీసీ ఆంజనేయులు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నివసిస్తున్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, అదే సమయంలో స్థానికంగా లేని వారిని గుర్తించి దొంగ ఓట్లను తొలగించాలని అధికారులకు సూచించారు. ఓటర్ల నమోదులో పార్టీ కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డీసీ ఆంజనేయులు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా అత్యంత ఖచ్చితత్వంతో కూడి ఉంటుందని, కొత్త ఓటర్లు నమోదు కోసం అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్-219 బీఎల్ఓ మౌనిక, బీఎల్ఏ శ్రీకాంత్ ముదిరాజ్, బూత్-220 బీఎల్ఓ లక్ష్మి, బీఎల్ఏ ఎండీ జంగీర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణ రాజపుత్, శేరి సతీష్ రెడ్డి, సునీల్ కుమార్, పిడికిటి గోపాల్ చౌదరి, రంగమోహన్, సుధా తదితర పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో కూచిపూడి నృత్యం మరియు అన్నమయ్య కీర్తనలు కార్యక్రమం



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూన్ 27. :** తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా 88వ రోజు నిర్వహించిన కూచిపూడి నృత్యం అన్నమయ్య కీర్తనలు కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. జూన్ 27, 2026న రవీంద్రభారతిలోని "పాల్కురికి సోమన్న మూల" వేదికపై శ్రీ గాయత్రి నృత్య కళాక్షేత్రం నాదయోగి కల్చర్ బృందం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కూచిపూడి నృత్య ప్రదర్శన: అన్న మయ్య కీర్తనల భావానికి అనుగుణంగా కూచిపూడి కళాకారులు చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి అభినయం, హావభావాలు, ముద్రలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. అన్నమయ్య సంకీర్తనల గానం: వాగ్గేయకారుడు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులు వేంకటేశ్వర స్వామిపై రచించిన ప్రముఖ కీర్తనలను గాయకులు భక్తిశ్రద్ధలతో ఆలపించారు.ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నర్సింహా రెడ్డి, ఐఏఎస్ సహాయ సంచాలకులు, పి. నర్సింలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ పి.విజయ్ కుమార్ కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. సాంస్కృతిక సలహా మండలి సభ్యులు శ్రీ ముచర్ల దినకర్ పాల్గొన్నారు. ప్రధాన కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు జానపద, సామాజిక చైతన్య గీతాలను ఆలపించి సభకు ఉత్సాహభరితమైన వాతావరణాన్ని కల్పించారు. వారి ప్రదర్శనలు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణను పొందాయి.

# దివ్యాంగులకు త్వరలో ఇంటర్ తరగతులు ప్రారంభం

**శరీరానికి పరిమితులు ఉండొచ్చు...**
**సంకల్పానికి ఎలాంటి పరిమితులు ఉండవు**

**హెలెన్ కెల్లర్ స్ఫూర్తితో దివ్యాంగుల**
**సాధికారతకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**దివ్యాంగులు జాలి కోరేవారు కాదు... అవకాశాలు**
**కల్పిస్తే అద్భుతాలు సృష్టించే ప్రతిభావంతులు**

**హెలెన్ కెల్లర్ 146వ జయంతి వేడుకల్లో**
**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)జూన్ 27:** "వైకల్యం విజయానికి అడ్డంకి కాదు... ఆత్మవిశ్వాసం లేకపోవడమే అసలైన అడ్డంకి. శరీరానికి పరిమితులు ఉండొచ్చు... కానీ సంకల్పానికి ఎలాంటి పరిమితులు ఉండవు" అని దివ్యాంగులు, వయోవృద్ధులు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రపంచానికి పట్టుదల, ఆత్మవిశ్వాసం, అచంచల సంకల్పానికి ప్రతీకగా నిలిచిన హెలెన్ కెల్లర్ 146వ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని దివ్యాంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర సంచాలకుల కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ... హెలెన్ కెల్లర్ జీవితం ప్రపంచానికి శాశ్వత స్ఫూర్తి అని పేర్కొన్నారు. కేవలం 19 నెలల వయసులో చూపు, వినికిడి రెండింటినీ కోల్పోయినా ఆమె తన సంకల్పబలంతో ప్రపంచ చరిత్రలో చెరగని ముద్ర వేసిందన్నారు. తన గురువు ఆన్ సలివన్ మార్గదర్శకత్వంలో స్పర్శ ద్వారా విద్యను అభ్యసించి, దృష్టి-శ్రవణ వైకల్యం ఉన్న తొలి డిగ్రీధారిణిగా చరిత్ర సృష్టించడమే కాకుండా రచయిత్రిగా, వక్తగా, సామాజిక సేవకురాలిగా కోట్లాది మంది దివ్యాంగులకు స్ఫూర్తిగా నిలిచిందని కొనియాడారు. "ఆమె చీకటిలో జీవించింది... కానీ ప్రపంచానికి వెలుగు చూపించింది. హెలెన్ కెల్లర్ ఒక వ్యక్తి కాదు... పట్టుదల అనే పదానికి ప్రత్యక్ష రూపం" అని మంత్రి పేర్కొన్నారు.

సంక్షేమం నుంచి సాధికారత వైపు తెలంగాణ ప్రయాణం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం దివ్యాంగులను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా సమాజ నిర్మాణంలో భాగస్వాములుగా తీర్చిదిద్దే దిశగా కట్టుబడి పనిచేస్తోందని మంత్రి తెలిపారు. దివ్యాంగుల వివాహ ప్రోత్సాహకాన్ని రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంచడం, స్కూటీలు, ఎలక్ట్రిక్ మొబిలిటీ వాహనాలు, సహాయక పరికరాల పంపిణీ, ఆన్‌లైన్ దరఖాస్తుల ద్వారా రెండున్నరేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో సుమారు 2,000 మంది లబ్ధిదారులకు పారదర్శకంగా సహాయం అందించామని వెల్లడించారు. దివ్యాంగ ఉద్యోగులు తమకు అనుకూలమైన ప్రాంతంలో బదిలీలు పొందేందుకు జీవో నెం.34 ద్వారా అవకాశం కల్పించడం ఈ ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయమని పేర్కొన్నారు. దివ్యాంగ విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రాధాన్యమిస్తూ కరీంనగర్, మహబూబ్‌నగర్, మిర్యాలగూడలో ప్రస్తుతం పదో తరగతి వరకు ఉన్న ప్రత్యేక పాఠశాలలను త్వరలో ఇంటర్మీడియట్ వరకు విస్తరించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించి అడ్వైజరీ బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రత్యేక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల వేతనాల్లో ఆలస్యం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు.దివ్యాంగుల పెన్షన్‌ను ప్రస్తుతం ఉన్న రూ.4,000 నుంచి రూ.6,000కు పెంచే దిశగా ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని, త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో దివ్యాంగులకు వారి కోటా ప్రకారం ప్రాధాన్యతనిస్తూ ఇళ్ల కేటాయింపులు జరుగుతున్నాయని, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాల్లోనూ వారికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు.

**"మీ సమస్యలు నా కుటుంబ సమస్యలే"**

దివ్యాంగుల కష్టాలు తనకు బాగా తెలుసని, తాను కూడా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. "మీకు మంత్రిగా కాదు... మీ కుటుంబ సభ్యుడిగా అండగా ఉంటాను. మీ సమస్యల పరిష్కారం నా బాధ్యత" అని హామీ ఇచ్చారు. గత పాలకులు దాదాపు పదేళ్లపాటు దివ్యాంగుల సమస్యలను పట్టించుకోలేదని, ప్రజా ప్రభుత్వం మాత్రం వారి ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. త్వరలో జావేద్ అబిద్ విగ్రహం ఏర్పాటు చేస్తానని మంత్రి అడ్లూరి హామీ ఇచ్చారు.వికలాంగుల హక్కుల కోసం పెద్ద ఎత్తున పోరాటం చేసి వారి సంక్షేమం కోసం పాటుపడిన జావేద్ విగ్రహాన్ని ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తానన్నారు.

**ప్రతిభకు ప్రోత్సాహం**

ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న ప్రతిభావంతులైన పలువురు దివ్యాంగ విద్యార్థులకు మంత్రి చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, ఇతర సహాయక పరికరాలు అందజేశారు.

**విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం**

విద్యార్థులను ఉద్దేశించి మంత్రి అడ్లూరి మాట్లాడుతూ..."మీరు జాలి కోరే వారు కాదు... అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించే ప్రతిభావంతులు." "మీ వైకల్యం మీ గుర్తింపు కాదు... మీ విజయం మీ అసలైన గుర్తింపు." "మీ లోపాన్ని ప్రపంచం గుర్తుంచుకోదు... మీరు సాధించిన విజయాన్ని మాత్రమే చరిత్ర గుర్తుంచుకుంటుంది." అని మంత్రి అడ్లూరి ఉద్బోధించారు. దేశంలో దృష్టిలోపాన్ని అధిగమించి సివిల్ సర్వీసుల్లో అత్యున్నత విజయాలు సాధించిన పలువురు యువతను ఉదాహరణగా పేర్కొంటూ, కుటుంబం, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే ఏ లక్ష్యమైనా సాధ్యమేనని చెప్పారు. "ఈ రోజు బెంచ్‌పై కూర్చున్న విద్యార్థి... రేపు జిల్లా కలెక్టర్ కావచ్చు. ఐఏఎస్, ఐపీఎస్, శాస్త్రవేత్తలు, వైద్యులు, న్యాయమూర్తులు, పారిశ్రామికవేత్తలు మీలో నుంచే రావాలి. మీ పేరు ముందు 'దివ్యాంగుడు' కాదు... 'విజేత' అని సమాజం పిలిచే రోజు రావాలి" అని మంత్రి ఆకాంక్షించారు. "అవరోధాలను అవకాశాలుగా మార్చుకుందాం... పరిమితులను విజయాలుగా మలుచుకుందాం... ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుదాం... తెలంగాణ అభివృద్ధి గాథలో మన విజయాలను స్వర్ణాక్షరాలతో లిఖిద్దాం" అని మంత్రి అడ్లూరి పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా దివ్యంగా విద్యార్థులతో కలిసి మంత్రి భోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధులు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, దివ్యాంగుల శాఖ సంచాలకురాలు శైలజ, కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ప్రభంజన్, వివిధ దివ్యాంగ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్‌పై ఆరోపణలు నిరాధారం

**పత్రికా సమావేశంలో ఓదాల గ్రామస్తులు**



**మంథని, జూన్ 27 ( వార్త సంధ్య) :** మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్‌పై ఓదాల గ్రామానికి చెందిన మోత్కు రాజబాబు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఓదాల గ్రామస్తులు పేర్కొన్నారు. శనివారం మంథని డివిజన్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామస్తులు మాట్లాడుతూ, మోత్కు రాజబాబుకు ఓదాల గ్రామంలో గానీ, కాంగ్రెస్ పార్టీలో గానీ ఎలాంటి అధికారిక పదవి లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పేరును ఉపయోగిస్తూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, మున్సిపల్ చైర్మన్‌తో పాటు పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా ఆధారరహిత ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాజబాబే ఓదాల గ్రామంలోని ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించుకున్నాడని, అడ్డు వచ్చిన గ్రామస్తులను బెదిరిస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. తన ట్రాక్టర్ల ద్వారా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తూ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నాడని వారు ఆరోపించారు.ఓదాల గ్రామంలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ,అటవీ శాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. అలాగే అక్రమ ఇసుక రవాణాపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు కఠిన చర్యలు తీసుకుని గ్రామంలో శాంతి, భద్రతలను పరిరక్షించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో చిట్టవేన గణపతి, మోత్కు అశోక్, భాస్కర్, జంజర్ల మొగిలి, గువ్వల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోం

**కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకులు**



**మంథని, జూన్ 27(వార్త సంధ్య) :** తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు లపై చల్లా నారాయణ రెడ్డి చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు తీవ్రంగా ఖండించారు.శనివారం మంథని డివిజన్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మైనార్టీ సెల్ నాయకులు జమీల్ అహ్మద్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అబ్దుల్ అలీమ్ మాట్లాడుతూ, శ్రీధర్ బాబు కుటుంబంపై ఆధారరహిత ఆరోపణలు చేయడం మానుకోవాలని చల్లా నారాయణ రెడ్డిని హెచ్చరించారు. పోలీస్ ఉన్నతాధికారులు తన వ్యక్తిగత భద్రతను తొలగించడానికి శ్రీధర్ బాబు కారణమని ఆరోపించడం సమంజసం కాదన్నారు. ప్రజా సంక్షేమం కోసం దుద్దిళ్ల కుటుంబం నిరంతరం పనిచేస్తోందని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీలు మారే వ్యక్తికి వారిని విమర్శించే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. ప్రజల కోసం సేవ చేస్తున్న నాయకులపై చౌకబారు విమర్శలు చేయడం మానుకోవాలని సూచిస్తూ, శ్రీధర్ బాబు కుటుంబంపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే మైనార్టీ సెల్ తరఫున తగిన విధంగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. అవాస్తవ ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు.

## మంథని 7వ వార్డు లో ఇంటింటి (సర్ )సర్వే నిర్వహణ



**మంథని, జూన్ 27(వార్త సంధ్య) :** మంథని మున్సిపాలిటీ 7వ వార్డులో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సర్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాల సేకరణ చేపట్టారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు జాబితాలో సక్రమంగా నమోద య్యేలా బిఎల్ఓ జవహరి,కాంగ్రెస్ బిఎల్ఏ మంథని సురేష్ తో కలిసి 7వ వార్డు కౌన్సిలర్ జంబోజు శ్రీమతి సమ్మయ్య ఏఎంసి డైరెక్టర్ ఎండి అంకుష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజలు సర్వేకు పూర్తి సహకారం అందించి అవసరమైన వివరాలు సమర్పించాలని ఆమె కోరారు.

## గతంలో 22 జూన్ 2026న జరిగిన సమావేశానికి కొనసాగింపుగా, తెలంగాణ ప్రభుత్వం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మధ్య ఈరోజు మళ్లీ చర్చలు జరిగాయి.



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 27. :** సచివాలయంలో జరిగిన ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ రామకృష్ణారావు, ఐఏఎస్ అధ్యక్షత వహించగా, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ సందీప్ సుల్తానియా, ఐఏఎస్ సిఎండి శ్రీ కె శశాంక, ఐఏఎస్ ఎస్బిఐవైపు నుండి జి ఎస్ రాణా, డి బి డి ఉ , సిడిఓ నీలేష్ ద్వివేది, పాల్గొన్నారు. చర్చల సందర్భంగా, ప్రతినిధుల బృందం 23 జూన్ 2026న రాష్ట్రం సూచించిన స్థానాలను సందర్శించిన తరువాత, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రత్యామ్నాయ ప్రతిపాదనలకు ఎస్బిఐ అంగీకరించింది. తమ బోర్డు ఆమోదం పొందిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్‌బీఐ అధికారులు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న కోర్టు విచారణలకు అనుగుణంగా ఈ విషయంలో అవసరమైన చర్యలు కూడా ప్రారంభించబడతాయి. చర్చల తర్వాత, ఎస్బిఐ రాష్ట్ర ప్రభుత్వం వస్తాయి.

## తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త..
## జూలై 15 నుంచి కొత్త ఆరోగ్య పథకం

**ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు మెరుగైన, నగదు రహిత వైద్యమే లక్ష్యం**


**ఉద్యోగ దంపతుల్లో ఒకరి జీతం నుంచే కంట్రిబ్యూషన్ వసూలుకు నిర్ణయం**

**త్వరలోనే ఆసుపత్రుల జాబితా, ప్యాకేజీ రేట్లను ప్రకటించనున్న ప్రభుత్వం**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన, క్రమబద్ధమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రూపొందించిన నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ను జూలై 15న ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో నగదు రహిత వైద్య సదుపాయం కల్పించనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధ్యక్షతన ఇటీవల జరిగిన ఎంప్లాయీస్ హెల్త్‌కేర్ ట్రస్ట్ సమావేశంలో పథకం ప్రారంభ తేదీని ఖరారు చేశారు. వారం రోజుల్లోగా వివిధ ఆసుపత్రుల యాజమాన్యాలతో ట్రస్ట్ సభ్యులు కీలక భేటీ నిర్వహించనున్నారు. ఆ తర్వాత నూతన ఈహెచ్ఎస్ మార్గదర్శకాలు, చికిత్సల ప్యాకేజీ ధరలు, ఎంప్యానెల్ చేసిన ఆసుపత్రుల తుది జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ పథకంలో భాగంగా ఉద్యోగుల ప్రయోజనార్థం ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైన పక్షంలో, వారిలో ఒకరి వేతనం నుంచి మాత్రమే హెల్త్ కంట్రిబ్యూషన్‌ను మినహాయించనున్నారు. ఈ నిర్ణయం వల్ల అటువంటి ఉద్యోగ కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గనుంది. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణలో పూర్తి పారదర్శకతను నిర్ధారిస్తూ, ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేకంగా 'ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్'ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ ట్రస్ట్ పర్యవేక్షణలోనే నూతన ఆరోగ్య పథకం అమలు కానుంది.

# పగలు నిద్రమత్తు, రాత్రి నిద్రలేమి

### ఇలాంటి వారు అప్రమత్తంగా ఉండాల్సిందే!
### నిద్రలేమి వల్ల పెరిగే హైబీపీ ముప్పు
### తాజా పరిశోధనలో వెల్లడి!

చాలామందికి పగటి పూట నిద్ర మత్తు ఆవహిస్తుంది. రాత్రివేళ నిద్ర పట్టక సతమతమవుతుంటారు. అయితే, ఇలాంటి వారు గుండె ఆరోగ్యం గురించి ఆలోచించాలంటున్నారు నిపుణులు. ఇవి రెండూ గలవారికి హైబీపీ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని తాజా అధ్యయనం సూచిస్తోంది. ఈ క్రమంలో పగటిపూట నిద్ర మత్తుకు, హైబీపీ మధ్య సంబంధం ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం! పగటిపూట మరీ ఎక్కువగా నిద్రమత్తుతో ఇబ్బంది పడేవారికి హైబీపీ ముప్పు ఎక్కువగా ఉన్నట్టు పెన్ స్టేట్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు గుర్తించారు. రాత్రిపూట పడుకున్నప్పుడు నిద్ర రావటానికి కనీసం 30 నిమిషాల కన్నా ఎక్కువ సమయం పట్టేవారికి ముప్పు మరింత పొంచి ఉంటున్నట్టూ ఈ అధ్యయనం పేర్కొంది. అంటే, ఇవి రెండూ కలిస్తే మరింత ప్రమాదకరమట. ఈ క్రమంలో నిద్రకూ హైబీపీకీ మధ్య సంబంధమేంటే, నిరంతరం పనిచేసే గుండె, రక్తనాళాల వ్యవస్థ కుదురుకోవటంలో నిద్ర కీలక పాత్ర పోషిస్తుంది. అయితే, నిద్ర అస్తవ్యస్తమైతే, తగినంత నిద్ర లేకపోతే అవి సరిగా కుదురుకోవట. అందువల్ల నిద్ర తీరుతెన్నులు బీపీని ఎలా ప్రభావితం చేస్తాయో, దీని విషయంలో మనం చేయగలిగిందేంటో తెలుసుకొని ఉండటం మంచిదట.

**రాత్రిళ్లు తగ్గుతుంది :** రాత్రిళ్లు కంటి నిండా నిద్రపోయినప్పుడు సహజంగానే బీపీ తగ్గుతుంది. ఇది గుండె, రక్తనాళాలకు విశ్రాంతి ఇస్తుందట. తిరిగి కోలుకోవటానికి సమయం ఉంటుంది. రక్తనాళాలు, గుండె ఆరోగ్యంలో ఇదొక ముఖ్యమైన భాగం. అయితే, నిద్రకు భంగం కలిగినా, ఎంత సేపటికి నిద్ర పట్టకపోయినా బీపీ అంతగా తగ్గదని నిపుణులు చెబుతున్నారు. కొంతమందికి అసలే తగ్గకపోవచ్చట. ఇది క్రమంగా హైబీపీకి దారితీస్తుందంటున్నారు. ఫలితంగా, గుండె జబ్బు ముప్పు పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు.

**శరీరం ఒత్తిడి స్థితిలో :** ప్రశాంతంగా నిద్రపోకపోతే శరీరానికి విశ్రాంతి లభించదు. దీన్నివల్ల ఒత్తిడి పెరుగుతుంది. దీర్ఘకాలంలో నిద్రలేమి బారిన పడతారు. దీని మూలంగా గుండె వేగం, బీపీ పెరుగుతాయి. రోజురోజుకు శరీరం విశ్రాంతి తీసుకునే సమయంలోనూ ఇవి ఎక్కువగా ఉంటూ వస్తాయి. ఈ క్రమంలో దీర్ఘకాలంగా నిద్రలేమితో ఇబ్బంది పడుతున్నట్టయితే శరీరం ఎక్కువ సేపు ఉత్తేజిత స్థితిలోనే ఉండిపోతుంది. ముమ్ముందు ఇది బీపీ మీద గణనీయమైన ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు.

**గురక తంటా :** కొన్నిసార్లు ఎంత సేపు పడుకున్నమన్నది కాదు, నిద్రపోయేటప్పుడు సాఫీగా శ్వాస ఆడకపోవటమూ సమస్య కావచ్చు. నిద్రలో కాసేపు శ్వాస ఆగేలా చేసే స్లీప్ అప్నియాకు హైబీపీకీ బలమైన సంబంధం ఉందంటున్నారు నిపుణులు. స్లీప్ అప్నియాలో శ్వాస ఆగినప్పుడు గట్టిగా గురక పెడుతూ తిరిగి శ్వాస తీసుకుంటుంటారట. ఇలా శ్వాస ఆగిన ప్రతిసారీ తాత్కాలికంగా బీపీ పెరుగుతుందని చెబుతున్నారు. ఇది గుండె మీద అదనపు భారం పడేలా చేస్తుందని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో గట్టిగా గురకపెట్టడం, నిద్రపోతున్నప్పుడు శ్వాస తీసుకోవటానికి కష్టపడటం, పగటిపూట అతిగా నిస్సత్తువ వంటివి స్లీప్ అప్నియా ప్రధాన లక్షణాలు. దీన్ని గుర్తించి, చికిత్స తీసుకుంటే బీపీ చాలా వరకూ కంట్రోల్?లోకి వస్తుంది.

**దీర్ఘకాల సవాళ్లు :** ఎప్పుడో అప్పుడు కాసేపు నిద్రను త్యాగం చేయటం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ, తరచూ నిద్ర తగ్గుతూ వస్తుంటే మాత్రం దీర్ఘకాలంలో విపరీత ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. అదే పనిగా ఆరు గంటల కన్నా తక్కువ సేపు నిద్రపోయే వారికి హైబీపీ ముప్పు ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అంతేకాదు, నిద్రలేమితో హార్మోన్ల సమతుల్యత, జీవక్రియలు, శరీరం బీపీని నియంత్రించే తీరు దెబ్బతింటాయట. తద్వారా, గుండె ఆరోగ్యాన్ని కాపాడే పలు వ్యవస్థల మీదా నిద్ర ప్రభావం చూపుతుంది. అయితే, నిద్రలేమి పరిణామాలు వెంటనే కనిపించకపోవచ్చు. కానీ, దీర్ఘకాలంలో బాగా ఇబ్బంది పెడతాయని గమనించాలి.

**అలవాట్ల మీదా ప్రభావం :** మనం బాగా అలసిపోయినప్పుడు మన అలవాట్లూ మారతాయి. ఇది పరోక్షంగా బీపీని ప్రభావితం చేస్తుందంటున్నారు నిపుణులు. కంటి నిండా నిద్రలేనప్పుడు ఉప్పు, చక్కెరతో కూడిన చిరుతిళ్ల మీదికి ధ్యాస మళ్లుతుందని చెబుతున్నారు. ఏ పని చేయడానికి ఆసక్తి ఉండదు. మొత్తంగా మరింత ఒత్తిడికి గురవుతాము. ఇవ్వన్నీ బీపీ మీద ప్రభావం చూపుతాయట. వీటికి నిద్రే ప్రధాన కారణవుతుండటం గమనార్హం.

**చిన్న మార్పులైనా :** ప్రశాంతంగా నిద్రపోతే బీపీ అదుపులోకి వస్తుంది. చిన్నచిన్న మార్పులైనా పెద్ద ప్రభావమే చూపుతాయంటున్నారు నిపుణులు. రోజూ ఒకే సమయానికి పడుకోవడం, లేవటం అలవాటు చేసుకోవాలి. పడకగదిలో అనువైన వాతావరణం ఉండేలా చూసుకోవడం. మరి ముఖ్యంగా, నిద్రపోవడానికి ముందు కాఫీ తాగకపోవటం, డిజిటల్ తెరలకు దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు ఎంతో మేలు చేస్తాయట. ఈ క్రమంలో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి మరింత ఆచరణీయమైన, సమర్థమైన వ్యూహాల్లో నిద్ర సమస్యల పరిష్కారం ఒకటని గుర్తుంచుకోవాలి.

# కిడ్నీ ఫెయిల్యూర్ వార్నింగ్స్ - లక్షణాలు ఎలా ఉంటాయో తెలుసా

### కిడ్నీ వ్యాధి లక్షణాలేంటి
### డాక్టర్‌ను ఎప్పుడు సంప్రదించాలంటే



రక్తం నుంచి వ్యర్థపదార్థాలను తొలగించడంతో పాటు శరీరంలోని ద్రవాలను సమతుల్యంగా ఉంచడంలో కిడ్నీలు కీలక పాత్ర పోషిస్తాయి. అలాంటి కిడ్నీలు ఫెయిల్యూర్ కావడం వల్ల రోగాల బారిన పడడంతో పాటు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉందంటున్నారు నిపుణులు. అయితే, కిడ్నీ సమస్యను ముందుగానే గుర్తించడం వల్ల మరణం నుంచి తప్పించుకోవచ్చని సూచిస్తున్నారు. ఈ క్రమంలో కిడ్ని వ్యాధిని సూచించే హెచ్చరిక సంకేతాల గురించి ఇప్పుడు తెలుసుకుందాంకిడ్నీ వ్యాధిని సైలెంట్ కిల్లర్ అని పిలుస్తారు. ముఖ్యంగా, దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి అయితే ఎటువంటి హెచ్చరిక సంకేతాలు లేకుండా కిడ్నీలను దెబ్బతీస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీని ప్రారంభ సంకేతాలు సాధారణంగా ఉండటం వల్ల, వ్యాధి తీవ్రమై డయాలసిస్ లేదా కిడ్నీ మార్పిడి అవసరమయ్యే వరకు చాలా మందికి తమకు ఈ సమస్య ఉన్నట్లు తెలియదట. ఈ క్రమంలో డయాబెటిస్, రక్తపోటు, జీవనశైలికి సంబంధించిన వ్యాధులు పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా కిడ్నీల సమస్యల భారం వేగంగా పెరుగుతోందని పలు పరిశోధనల్లో వెల్లడైంది. దీనిని ముందుగానే గుర్తించడం చాలా ముఖ్యమంటున్నారు. అందుకు, క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచిస్తున్నారు.రాత్రి సమయంలో తరచూ మూత్రవిసర్జన : కిడ్నీ వ్యాధికి సంబంధించిన ప్రారంభ సంకేతాల్లో తరచూ మూత్ర విసర్జనకు వెళ్లడం ఒకటని అష్ట్రం.బఎ పేర్కొంది. ముఖ్యంగా, రాత్రిపూట మూత్ర విసర్జన చేయడానికి చాలాసార్లు మేల్కొంటునట్లయితే అది కిడ్నీ వ్యాధి లక్షణం కావచ్చనని నిపుణులు చెబుతున్నారు. మూత్రపిండాల్లోని ఫిల్టర్లు దెబ్బతిన్నప్పుడు, మూత్రవిసర్జన చేయాలనే కోరిక పెరుగుతుందంటున్నారు. మరి ముఖ్యంగా, రాత్రిపూట ఎక్కువసార్లు నిద్రలేవాల్సి వస్తుందని వివరిస్తున్నారు.

**పాదాలు లేదా కాళ్లలో వాపు :** మూత్రపిండాల వైఫల్య లక్షణాల్లో చేతులు, చీలమండలు లేదా ముఖం చుట్టూ వాపు వస్తుందని ఎశ్రీవజవశ్రీఖఅఎశ్రీఅఅఎ పేర్కొంది. కిడ్నీలు సరిగ్గా పనిచేయనప్పుడు అవి అదనపు సోడియం ద్రవాన్ని, నీరును ఫిల్టర్ చేయలేవని నిపుణులు చెబుతున్నారు. ఇది క్రమంగా ద్రవ నిలుపుదలకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. ఫలితంగా, పాదాలు లేదా కాళ్లలో వాపు వస్తుందని వివరిస్తున్నారు. ముఖ్యంగా, దిగువ భాగాల్లో బూట్లు లేదా సాక్స్ వేసుకునే ప్రదేశంలో సాధారణంగా కంటే గట్టిగా ఉన్నట్లు మీకు అనిపిస్తే అది కిడ్నీ వ్యాధికి సంకేతం కావచ్చని సూచిస్తున్నారు.

**మూత్రంలో రక్తం :** మూత్రంలో రక్తం కనిపించడం అనేది కిడ్నీలు దెబ్బతిన్నాయనడానికి తీవ్రమైన సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మూత్రంలో రక్తం వస్తే మూత్ర నాళానికి నష్టం జరిగిందని చెబుతున్నారు. ఇది మూత్రపిండాల్లో రాళ్లు, ఇన్ఫెక్షన్ లేదా తీవ్రమైన కిడ్నీ వ్యాధికి సంకేతం కావచ్చని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో మూత్రం గులాబీ, ఎరుపు లేదా గోధుమ రంగు లేదా రక్తం గడ్డకట్టడాన్ని గమనించినట్లయితే వెంటనే సంబంధిత డాక్టర్‌ను సంప్రదించాలని సలహా ఇస్తున్నారు. మూత్రంలో రక్తం అనేది కిడ్నీ వ్యాధికి అత్యంత ఆందోళనకరమైన హెచ్చరిక సంకేతాల్లో ఒకటని పేర్కొంది.

**నురుగతో కూడిన మూత్రం :** నురుగుతో కూడిన మూత్రం రావడాన్ని ప్రోటీన్యూరియా అంటారు. కిడ్నీలు దెబ్బతిన్నప్పుడు ప్రోటీన్‌లను సమర్థంగా ఫిల్టర్ చేసే సామర్థ్యాన్ని కోల్పోయినప్పుడు మాత్రమే ఇలా జరుగుతుందని నిపుణులు అంటున్నారు. ఫలితంగా, అల్బుమిన్ వంటి ప్రోటీన్లు మూత్రంలోకి లీక్ అవుతాయని, దీనివల్ల మూత్రంలో నురుగు ఎక్కువగా కనిపిస్తుందని చెబుతున్నారు.

**శ్వాస ఆడకపోవడం :** కిడ్నీ వ్యాధి వల్ల ఊపిరితిత్తుల్లో ద్రవాలు పేరుకుపోవడానికి దారితీస్తాయంటున్నారు నిపుణులు. దీంతో శ్వాస ఆడకపోవడం లాంటి సమస్యలు తలెత్తుతాయని చెబుతున్నారు. ఇది కిడ్నీ వ్యాధి చివరి దశలో ఎక్కువగా కనిపిస్తుందని పేర్కొంటున్నారు. కానీ, కొందరిలో ఈ సమస్య ప్రారంభ దశల్లో కూడా సంభవించవచ్చని తెలియజేస్తున్నారు. శరీరం నుంచి వ్యర్థాలు, అదనపు ద్రవాలను ఫిల్టర్ చేయలేకపోతే అవి ఊపిరితిత్తుల్లో పేరుకుపోతాయని, దీని వల్ల శ్వాస తీసుకోవడం కష్టమవుతుందని పేర్కొంది. ముఖ్యంగా, విశ్రాంతి తీసుకునేటప్పుడు లేదా పడుకునేటప్పుడు శ్వాస తీసుకోవడంలో కష్టంగా ఉంటే వీలైనంత త్వరగా డాక్టర్‌ను సంప్రదించడం మంచిదట.

**నిరంతర అలసట, బలహీనత :** అలసట అనేక అనారోగ్య పరిస్థితులకు సాధారణ లక్షణం. కిడ్నీలు సరిగ్గా పనిచేయనప్పుడు శరీరం వ్యర్థ, విష పదార్థాలతో నిండిపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా, ఒంట్లో శక్తి లేకపోవడం, అలసటకు దారి తీస్తుందంటున్నారు. తగినంత విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా నిరంతర అలసటగా అనిపిస్తే కిడ్నీ వ్యర్థాలను సమర్థవంతంగా ఫిల్టర్ చేయడం లేదని అర్థం చేసుకోవాలని తెలియజేస్తున్నారు.

# వర్షాకాలంలో ఈ ఆహారాన్ని తింటే ఫుడ్ పాయిజన్ అయ్యే ప్రమాదం పొంచి ఉంది సుమా



వర్షాకాలంలో వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే ఈ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం కూడా ముఖ్యం. ఈ సీజన్‌లో ఫుడ్ పాయిజనింగ్ ప్రమాదం చాలా పెరుగుతుంది. అటువంటి పరిస్థితిలో వర్షాకాలంలో కొన్ని రకాల ఆహారపదార్థాలను తినవద్దు. ఎందుకంటే కొన్ని రకాల ఆహార పదార్థాలను తినడం వలనా ఆరోగ్యానికి హానికరమ. వర్షాకాలం ఆహ్లాదంగా, చల్లగా ఉంటుంది. అయితే ఈ కాలంలో ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఈ సమయంలో గాలిలో తేమ పెరుగుతుంది. ఇది బ్యాక్టీరియా , ఫంగస్ పెరుగుదల ప్రమాదాన్ని పెంచుతుంది. అందుకే వర్షాకాలంలో ఆహారం త్వరగా చెడిపోతుంది. ఫుడ్ పాయిజనింగ్, డయేరియా, టైఫాయిడ్, కలరా వంటి ఇన్ఫెక్షన్ల ప్రమాదం పెరుగుతుంది. ఈ సీజన్‌లో ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే వర్షాకాలంలో కనిపించిన ప్రతిదీ తినడం సరైనది కాదు. కనుక వర్షాకాలంలో ఏ ఆహారపదార్థాలను తినకూడదో నిపుణుల సలహా ఏమిటో తెలుసుకుందాం.. తద్వారా ఆరోగ్యంపై ఎటువంటి చెడు ప్రభావం ఉండదు. ఫుడ్ పాయిజనింగ్‌ను నివారించవచ్చు. ఫుడ్ పాయిజనింగ్ అంటే ఏమిటి? ఫుడ్ పాయిజనింగ్ అనేది కలుషితమైన లేదా బ్యాక్టీరియా సోకిన ఆహారం లేదా నీటిని తీసుకోవడం వల్ల సంభవించే సాధారణ సమస్య. అదే సమయంలో ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్య. ఇది సాధారణంగా వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి, జ్వరం, బలహీనత వంటి సమస్యలను కలిగిస్తుంది. వర్షాకాలం , వేసవి కాలంలో దీని ప్రమాదం మరింత పెరుగుతుంది. ఎందుకంటే తేమ, వేడి కారణంగా బ్యాక్టీరియా వేగంగా పెరుగుతుంది. దీనిని ఎలా నివారించాలో నిపుణులు చెప్పిన విషయాలు తెలుసుకుందాం. నిపుణులు ఏమంటున్నారు? వర్షాకాలంలో వాతావరణం మారుతుందని, దీనివల్ల బ్యాక్టీరియా పెరిగే అవకాశాలు ఉంటాయని గంగారామ్ హాస్పిటల్ సీనియర్ డైటీషియన్ ఫరేహా షానమ్ అంటున్నారు. అటువంటి పరిస్థితిలో ప్రతి ఒక్కరూ తినే ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. బయటి ఆహారం తినవద్దు. పండ్లు లేదా వండని ఆహారాలను, పచ్చి వస్తువులు వంటి వాటిని తినే సమయంలో జాగ్రత్త తీసుకోవాలి.

**మునగ విత్తనాలు ఇలా ట్రై చేయండి.. ఒత్తైన జుట్టు మీ సొంతం**

నకిలీ పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తున్న ముఠాలు అరెస్టు

వివాహ వేడుకలో వీనుల విందుగా హరినామ సంకీర్తన.. వీడియో వైరల్

దేశంలోని మహిమాన్విత హనుమాన్ ఆలయాలు ఎక్కడ ఉన్నాయంటే..

ఫరేహా షానమ్ ఇంకా మాట్లాడుతూ స్ట్రీట్ ఫుడ్ కు దూరంగా ఉండాలి. ముఖ్యంగా పానీ పూరి, పుదీనా నీరు వంటి నీళ్ళు ఎక్కువగా ఉండేవి.. మారుతున్న వాతావరణంలో ఈ పదార్థాలు ఇన్ఫెక్షన్‌కు కారణమవుతాయి, దీనివల్ల చర్మ అలెర్జీలు కూడా వస్తాయి. వీలైతే వర్షాకాలంలో ఇంట్లో వండిన ఆహారాన్ని మాత్రమే తినాలని.. వీలైనంత వరకు నాన్-వెజ్‌కు దూరంగా ఉండాలని డైటీషియన్ ఫరేహా షానమ్ సూచించారు. ఫుడ్ పాయిజనింగ్ అయినప్పుడు ఏమి తినాలి? త్రాగాలి? వర్షాకాలంలో మీకు లేదా ఇంట్లో ఎవరికైనా ఫుడ్ పాయిజన్ అయితే తినే ఆహారంలో కొన్ని విషయాలను చేర్చుకోవడం ద్వారా ఉపశమనం పొందవచ్చు. హెల్త్‌లైన్ ప్రకారం ఫుడ్ పాయిజనింగ్ వల్ల వాంతులు, విరేచనాల సమస్య ఏర్పడుతుంది. అప్పుడు శరీరంలో నీటి కొరత ఉంటుంది. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడానికి ఎలక్ట్రోలైట్ , ద్రవ పదార్థాలను తీసుకోవాలి. దీనితో పాటు తక్కువ ఫైబర్, తక్కువ కొవ్వు ఉన్న ఆహారాన్ని తినాలి. బియ్యం, అరటిపండు, సాదా బంగాళాదుంపలు, ఓట్ మీల్ వంటి వాటిని తినే ఆహారంలో చేర్చుకోవాలి.

# డయాబెటిస్, అధిక బరువుకు చెక్ నెల రోజులు ఈ ఒక్కటి మానేస్తే చాలు!



ప్రతిరోజూ మనం తాగే టీ, కాఫీ నుండి తినే ప్రతి ఆహారం వరకు, చక్కెర ఒక భాగమైపోయింది. ఆధునిక ఆహారపు అలవాట్లలో మనం ఎక్కువగా తీసుకునే పదార్థం చక్కెర. ఇది తక్షణ శక్తిని ఇస్తుంది. కానీ, అధికంగా చక్కెర వాడితే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఒక నెల రోజుల పాటు చక్కెరను పూర్తిగా మానేస్తే మీ శరీరంలో ఎలాంటి మార్పులు వస్తాయో ఈ కథనంలో చూద్దాం. చక్కెరలో అధిక కేలరీలు ఉంటాయి. ఇవి మన శరీరంలో కొవ్వు రూపంలో పేరుకుపోతాయి. ఒక నెల చక్కెరను మానేస్తే, శరీరానికి అధిక కేలరీలు చేరవు. దీంతో బరువు తగ్గడం మొదలవుతుంది. ముఖ్యంగా, పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వు తగ్గి, మీ శరీరం మరింత అందంగా మారుతుంది.

### చక్కెర జబ్బు ముప్పు తగ్గుతుంది

అధిక చక్కెర వాడకం ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది. ఇది చక్కెర జబ్బు వచ్చే అవకాశాన్ని పెంచుతుంది. చక్కెరను మానేసిన తర్వాత, రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి. దీంతో ఇన్సులిన్ సున్నితత్వం మెరుగుపడుతుంది. చక్కెర జబ్బు వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది.

### శక్తి స్థిరంగా ఉంటుంది

చక్కెర తక్షణ శక్తిని ఇస్తుంది. కానీ, ఇది త్వరగా అలసటను కూడా తెస్తుంది. ఒక నెల చక్కెరను మానేస్తే, శరీరం సహజ శక్తి వనరులైన పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలపై ఆధారపడుతుంది. దీనివల్ల ఎక్కువ సేపు శక్తి ఉంటుంది. రోజంతా అలసట లేకుండా ఉత్సాహంగా ఉండగలరు.

### చర్మ సమస్యలు తగ్గుతాయి

చక్కెర శరీరంలో వాపును పెంచుతుంది. దీనివల్ల మొటిమలు, దద్దుర్లు, చర్మం త్వరగా ముడతలు పడటం వంటి సమస్యలు వస్తాయి. ఒక నెల చక్కెరను తినకపోతే, చర్మం మృదువుగా, కాంతివంతంగా మారుతుంది. అంతేకాదు, చర్మంపై నూనె ఉత్పత్తి కూడా తగ్గుతుంది.

### మానసిక ఒత్తిడి తగ్గుతుంది

చక్కెర మెదడుకు తాత్కాలిక సంతోషాన్ని ఇస్తుంది. కానీ, ఆ తర్వాత మానసిక ఒత్తిడిని, కోపాన్ని పెంచుతుంది. చక్కెరను మానేసిన తర్వాత, మానసిక ఒత్తిడి తగ్గుతుంది. మనసు ప్రశాంతంగా ఉంటుంది. మీ నిద్ర కూడా మెరుగుపడుతుంది. ఇది మీ మానసిక ఆరోగ్యాన్ని మరింత పెంపొందిస్తుంది.

### రక్తపోటు నియంత్రణలో ఉంటుంది

అధిక చక్కెర వాడకం రక్తపోటును పెంచుతుంది. ఒక నెల చక్కెరను మానేస్తే, రక్తపోటు తగ్గి, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.

### పళ్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది

పళ్లు పుచ్చిపోవడానికి, పళ్లలో చీము పట్టడానికి చక్కెర ప్రధాన కారణం. ఒక నెల రోజుల పాటు చక్కెరను మానేస్తే, పళ్లలో బ్యాక్టీరియా పెరుగుదల తగ్గుతుంది. పళ్ల సమస్యలు కూడా తగ్గుతాయి. ఒక నెల చక్కెరను మానేయడం వల్ల మీ శరీరానికి అనేక ప్రయోజనాలు కలుగుతాయి. బరువు తగ్గడం, ఆరోగ్యకరమైన చర్మం, మంచి మానసిక స్థితి, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తగ్గడం వంటివి ఇందులో ఉన్నాయి. చక్కెరను మానేయడం సవాలుగా ఉన్నప్పటికీ, దాని ప్రయోజనాలు చాలా గొప్పవి. కాబట్టి, మీ ఆహారంలో సహజమైన తీపిని చేర్చుకుని, చక్కెర వినియోగాన్ని తగ్గించడానికి ప్రయత్నించండి.

# ఒత్తైన మెరిసే జుట్టు కావాలా మునగ విత్తనాలు ట్రై చేయండి ఎలా ఉపయోగించాలంటే



మునగాకు మునగ కాయ, మునగపువ్వులో మాత్రమే కాదు మునగ విత్తనాల్లో కూడా ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. ముఖ్యంగా జుట్టు పెరిగేందుకు మునగ విత్తనాలు ఎంతగానో ఉపయోగపడతాయి. జుట్టు పెరుగుదల కోసం రసాయనాలతో నిండిన ఉత్పత్తులతో విసిగిపోయివారు జుట్టు పెరుగుదల కోసం మునగ గింజలను ఉపయోగించండి. పురాతన ఆయుర్వేదంలో వీటిని జుట్టు పెరుగుదల కోసం ఉపయోగించేవారు. ఈ రోజు ఎలా వాటిని ఉపయోగించాలో తెలుసుకుందాం.. మునగ గింజలలో కూడా పోషకాలు సమృద్ధిగా ఉన్నాయి. ఇవి జుట్టుకు అద్భుతమైన ప్రయోజనాలను అందిస్తాయి. వీటిల్లో జింక్, ఐరన్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్లు %ూ, జు , జ% లు అధికంగా ఉన్నాయి. ఇవన్నీ ఆరోగ్యకరమైన జుట్టు, బలమైన జుట్టు కుదుళ్లకు కీలకమైనవి. జింక్ జుట్టు కుదుళ్ల మరమ్మత్తును చేస్తుంది. ఐరెన్ తల చర్మంలో రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఒమేగా-3లు జుట్టు పొడిబారడం తగ్గిస్తుంది. మోరింగ సీడ్ ఆయిల్ స్కాల్ప్ మసాజ్: మునగ గింజలు నూనె రూపంలో కూడా దొరుకుతుంది. ఇది జుట్టుకు అత్యంత ప్రభావవంతమైన నూనె. మునగ గింజల నూనె తేలికైనది, జిడ్డు లేనిది, యాంటీఆక్సిడెంట్లు, పోషకాలతో నిండి ఉంది. ఈ నూనెను ఎలా ఉపయోగించాలంటే రెండు టేబుల్ స్పూన్ల మునగ గింజల నూనెను వేడి చేయండి. జుట్టును విభాగాలుగా విడదీసి, నేరుగా నూనెను తలకు అప్లై చేయండి. రక్త ప్రసరణను పెంచడానికి 5-10 నిమిషాలు వృత్తాకారంగా సున్నితంగా మసాజ్ చేయండి. కనీసం 1 గంట లేదా రాత్రంతా అలాగే ఈ నూనెని ఉంచండి. తర్వాత తేలికపాటి షాంపూతో జుట్టుని శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి రెండు సార్లు చేయడం వలన జుట్టు మందంగా ఒత్తుగా పెరుగుతుంది.

### నకిలీ పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తున్న ముఠాలు అరెస్టు

వివాహ వేడుకలో వీనుల విందుగా హరినామ సంకీర్తన.. వీడియో వైరల్

దేశంలోని మహిమాన్విత హనుమాన్ ఆలయాలు ఎక్కడ ఉన్నాయంటే..

ఎముకలు బలహీనంగా ఉన్నాయా.. ఈ కూరగాయలను తినే ఆహారంలో చేర్చుకోండి..

మునగ గింజల హెయిర్ మాస్క్: మునగ గింజల పొడిని ఉపయోగించడం వల్ల నిస్తేజంగా, పెళుసుగా ఉండే జుట్టు కుదుళ్ళను పునరుద్ధరించవచ్చు. జుట్టులోని తేమ సమతుల్యతను పునరుద్ధరించవచ్చు. ఎలా ఉపయోగించాలంటే .. 2 టేబుల్ స్పూన్ల మునగ గింజల పొడి, 1 టేబుల్ స్పూన్ కలబంద జెల్ లేదా పెరుగు, 1 టేబుల్ స్పూన్ తేనె తీసుకుని దీనిలో కొన్ని చుక్కల రోజ్మేరీ ఎసెన్షియల్ ఆయిల్ వేసుకుని వీటన్నిటిని మెత్తని పేస్ట్‌లా కలపండి. ఈ మిశ్రమాన్ని తలకు.. జుట్టు పొడవునా సమానంగా అప్లై చేయండి. తర్వాత 30-45 నిమిషాలు అలాగే ఉంచండి. అనంతరం జుట్టుని చల్లటి నీరు, తేలికపాటి షాంపూతో శుభ్రం చేసుకోండి. .. ఖాళీ కడుపుతో ప్రతిరోజూ 1-2 విత్తనాలతో ప్రారంభించండి. వాటిని పచ్చిగా తినండి లేదా గోరువెచ్చని నీటితో వేసుకుని తెసుకోండి. అంతేకాదు మునగ విత్తనాలను చూర్ణం చేసి స్మూతీలు, సూప్‌లు లేదా సలాడ్‌లకు కూడా జోడించవచ్చు. ఇలా తీసుకోవడం వలన కాలక్రమేణా పోషకాల శోషణ, హార్మోన్ల సమతుల్యత , రక్త ప్రసరణను పెంచుతుంది,ఇవన్నీ జుట్టు పెరుగుదలకు కీలకమైనవి. హెచ్చరిక: మునగ గింజలు శక్తివంతమైనవి. తక్కువ పరిమాణంలో ప్రారంభించే ముందు వైద్యుడిని సంప్రదించండి, ముఖ్యంగా గర్భవతి లేదా మందులు తీసుకునేవారు తప్పని సరిగా వైద్య సలహా తీసుకోవాలి. జుట్టు పెరుగుదల కోసం ఎలా జుట్టు సంరక్షణ దినచర్యలో భాగంగా మునగ గింజలను చేర్చుకోవడం వలన బలమైన, ఆరోగ్యకరమైన జుట్టును పొందడానికి సహజమైన, ఖర్చుతో కూడుకున్న మార్గం. మునగ గింజల నూనెను రాసుకున్నా, మాస్క్ తయారు చేసుకున్నా, స్మూతీలుగా తీసుకున్నా ఫలితం కనిపించాలంటే విడవకుండా 4-6 వారాల ఉపయోగించాలి. అప్పుడే తగిన ఫలితం కనిపిస్తుంది.



## 6 క్యారవాన్లు, 50 మంది అసిస్టెంట్లు..
## విజయ్ దేవరకొండ డిమాండ్ వార్తలపై స్పందించిన నిర్మాత

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టలతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆయన నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఇటీవల ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో పలు వార్తలు వైరల్‌గా మారాయి. 'రణబాలి' చిత్రీకరణ సమయంలో విజయ్ దేవరకొండ ఐదు కారవాన్లు ఏర్పాటు చేయాలని కోరారని, తన వెంట పెద్ద సంఖ్యలో అసిస్టెంట్లు ఉండాలని డిమాండ్ చేశారనే ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ వార్తలు అభిమానుల్లో చర్చకు దారితీశాయి. ఈ ప్రచారంపై ఇప్పటికే విజయ్ దేవరకొండ బృందం స్పందించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేసింది. హీరోపై కావాలనే తప్పుడు ప్రచారం జరుగుతోందని పేర్కొంది. అసత్య కథనాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని విజయ్ టీమ్ హెచ్చరించింది. తాజాగా ఈ వివాదంపై చిత్ర నిర్మాత రవి కూడా స్పందించారు. షూటింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, విజయ్ దేవరకొండ నుంచి అసాధారణమైన డిమాండ్లు ఏవీ రాలేదని ఆయన స్పష్టం చేశారు. విజయ్ ఎప్పుడూ పనిపట్ల నిబద్ధతతో వ్యవహరిస్తారని, సమయపాలనకు ప్రాధాన్యం ఇస్తారని నిర్మాత తెలిపారు. ఆయనపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు. ఇక 'రణబాలి' సినిమా విషయానికి వస్తే, ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టను తెరకెక్కిస్తున్నారు. 1854 నుంచి 1878 మధ్య బ్రిటిష్ పాలన కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఇప్పటికే మంచి బజ్ ఏర్పడింది. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'రణబాలి' చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తయింది. మిగిలిన భాగాన్ని వేగంగా పూర్తి చేసి సినిమాను సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, కాన్సెప్ట్ విజువల్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ చిత్రాల్లో ఒకటిగా 'రణబాలి' రూపొందుతున్నట్లు టాక్ వినిపిస్తోంది.

## ఉత్కంఠను కలిగించేలా 'తత్వం' ట్రైలర్




కొత్త కథలు, వినూత్నమైన కథలకు తెలుగు ప్రేక్షకుల్లో మంచి ఆదరణ ఉంటుంది. సినిమా చూస్తున్నంత సేపు వాళ్లని ఎంగేజ్ చేయగలిగితే ఆ సినిమా చిన్నదైనా పెద్ద విజయాన్ని అందిస్తారు. ముఖ్యంగా మర్డర్ మిస్టరీ జానర్ సినిమాల్లో ఉండే ఉత్కంఠ, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటుంది. ఇప్పుడు ఇదే కోవలో ఓ వైవిధ్యమైన కథాంశంతో ప్రేక్షకులకు థ్రిల్ కలిగించే అంశాలతో రాబోతున్న చిత్రం 'తత్వం'. దినేష్ తేజ్, దష్విక.కె హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి, శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎడిటర్ విప్లవ్ నైషదం మాట్లాడుతూ '' ఈ సినిమా జర్నీ ఎంతో స్పెషల్.. ఈ సినిమా కోసం అందరూ ఎంతో కష్టపడ్డారు. అర్జున్ సాఫ్టవేర్‌రంగం నుంచి వచ్చి ఎంతో ఇష్టంతో ఈ సినిమాకు దర్శకత్వం చేశాడు. ఎంతో అనుభవం ఉన్న దర్శకుడిలా ఈ చిత్రాన్ని డీల్ చేశాడు,. ఆద్యంత ఎంతో ఉత్కంఠభరితంగా ఉంటుంది. ఈ ప్రాజెక్టలో భాగమైనందుకు నాకు సంతోషంగా ఉంది' అన్నారు. సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ మాట్లాడుతూ '' ఈ రోజుల్లో చిన్న సినిమాల ద్వారా మంచి కంటెంట్‌ను ఇస్తున్నారు. ఆడియన్స్ కూడా ఆదరిస్తున్నారు. ఇది కూడా ఆ కోవలోకి వచ్చే చిత్రమే. ఈ సినిమా అందరికి తప్పకుండా నచ్చుతుంది. మంచి ఎమోషనల్ కనెక్టవిటి ఉన్న థ్రిల్లర్. సంగీతానికి స్కోప్ ఉన్న చిత్రమిది. అర్జున్ ఎంతో ప్రతిభ ఉన్న దర్శకుడు' అన్నారు. నిర్మాత వంశీ సీమకుర్తి మాట్లాడుతూ '' ట్రైలర్ అందరికి నచ్చింది. సినిమా కూడా చాలా బాగుంటుంది. దర్శకుడు అనుకున్నది అనుకున్నట్లుగా స్క్రీన్‌పై ప్రజెంట్ చేశాడు. ఈసినిమా మంచి అవుట్ పుట్ రావడానికి అందరూ సహకరించారు. అందరూ ఈ సినిమాను థియేటర్‌లో చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు అర్జున్ కోలా మాట్లాడుతూ '' ఈ మూవీ టైటిల్, కాన్సెప్ట్‌ను మన చుట్టు జరుగుతున్న ఇన్‌సిడెంట్స్ ఆధారంగా తయారుచేసుకున్నాను. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్ ఇది. దినేష్ తేజ్ వినగానే వెంటనే ఓకే చేశాడు. ఈ సినిమా కోసం అందరూ దిబెస్ట్ ఇచ్చారు. కథ తప్పకుండా అందర్ని ఎంగేజింగ్‌గా ఉంటుంది. వంశీ గారి అన్వేషణ తరహాలోనే అందర్ని కట్టిపడేసే సినిమా ఇది. ఈ సినిమాలో ఉంటే ట్విస్ట్ ఆడియన్స్‌కు షాకింగ్‌గా ఉంటుంది।' అన్నారు. హీరో దినేష్ తేజ్ మాట్లాడుతూ 'నేను కలిసి పనిచేయాలనుకున్న టెక్నిషియన్స్‌తో ఈ సినిమాలో వర్క్ చేశాను. ఈసినిమాతో చాలా మంది కొత్తవాళ్లు పరిచయం అవుతున్నారు. అందరం చాలా కష్టపడ్డాం. అది సినిమా చూసిన తరువాత అందరికి తెలుస్తుంది. ఇక మీద నా సినిమాలకు గ్యాప్ రాదు.




## 4 నెలల్లో షూటింగ్ కంప్లీట్..
## 'వారణాసి'పై రాజమౌళి బిగ్ అప్‌డేట్!

మహేశ్ బాబు, ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ 'వారణాసి' సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ సినీ అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. ఈ చిత్ర షూటింగ్ మరో నాలుగు నెలల్లో, అంటే ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా పూర్తిగా ముగియనుందని దర్శకుడు రాజమౌళి స్వయంగా వెల్లడించారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆయన ఒక అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలను పంచుకున్నారు. సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోయే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణతో పాటు వారణాసిలోని ముఖ్యమైన భాగాల షూటింగ్ కూడా ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం కేవలం కథను అనుసంధానం చేసే చిన్న చిన్న సన్నివేశాలను మాత్రమే తెరకెక్కిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇక ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందించడంపై రాజమౌళి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కథ ఐమాక్స్ స్క్రీన్‌పై చూస్తేనే అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని తాము ముందుగానే భావించామని, అయితే ఈ ఫార్మాట్ కోసం కథలో ఎలాంటి ప్రధాన మార్పులు చేయలేదని కేవలం సాంకేతిక పరమైన సర్దుబాట్లు మాత్రమే చేశామని తెలిపారు. సాధారణంగా మన కళ్లు సినిమా స్కోప్ ఫార్మాట్‌కు అలవాటు పడ్డాయని, అందువల్ల అటు ఐమాక్స్, ఇటు సినిమా స్కోప్ రెండింటికీ సరిపోయేలా 'అనోమార్ఫిక్ ఫ్రేమింగ్' పద్ధతిని ఉపయోగించి దృశ్యాలను చిత్రీకరించినట్లు వివరించారు. దీనికోసం ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ, ఆ తర్వాత పని చాలా సులభంగా సాగిపోయిందని జక్కన్న చెప్పుకొచ్చారు. ఇక గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది.

# తెలంగాణలో జరిగిన వాస్తవ ఘటనలతో 'సర్కారు బాయి'






శ్రీరామ్ నిమ్మల, వర్షిక హీరో హీరోయన్స్ గా నటిస్తున్న సినిమా 'సర్కారు బాయి'. ఈ చిత్రాన్ని డెక్కన్ ఫిలింస్ సమర్పణలో ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి నిర్మిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు లారా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అప్పటి తెలంగాణ సమాజాన్ని ప్రతిబింబిస్తూ నీటి సమస్యలు, కుల వివక్ష, అణగారిన వర్గాల జీవిత పోరాటం వంటి అంశాలను దర్శకుడు లారా కళ్లకు కట్టినట్లు తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు హీరో శ్రీరామ్ నిమ్మల పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ మూవీ టీమ్ బర్త్ డే పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో తెలంగాణ పల్లె యువకుడిగా ఎంతో సహజంగా శ్రీరామ్ నిమ్మల కనిపిస్తున్నారు. ప్రస్తుతం "సర్కారు బాయి" సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ నెల 17వ తేదీ నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. చేగుంట సమీపంలోని రెడ్డిపల్లి అనే ఊరిలో "సర్కారు బాయి" చిత్రీకరణ జరుపుతున్నారు. ఈ లెంగ్తీ షెడ్యూల్ లో సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా హై క్వాలిటీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మిస్తున్నారు. హీరో శ్రీరామ్ నిమ్మల, హీరోయిన్ వర్షిక, ముఖ్య నటీనటులు బాహుబలి ప్రభాకర్, నాగ మహేష్ లపై సీన్స్ షూటింగ్ చేస్తున్నారు. జూలై నెలాఖరు వరకు ఈ భారీ షెడ్యూల్ కొనసాగనుంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలో మేకర్స్ వెల్లడించనున్నారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.